శనివారం
15-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 173
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'హోలీ' మిఠాయిల్లో గంజాయి

పోలీసులకు చిక్కిన విక్రేత

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు భిన్న సంస్కృతుల్లో సంబరాల్లో మునిగి తేలిన వేళ అక్రమార్కులు రెచ్చిపోయారు. మాదక ద్రవ్యాల విక్రయాలను జోరుగా సాగించారు. హైదరాబాద్ లోయర్ దూల్పేట్ మల్చిపురాలో హోలీ సంబరాలే అదునుగా గంజాయి విక్రేతలు కొత్త దారులు వెతికారు. కుల్ఫీ ఐస్ క్రీమ్, బర్ఫీ స్వీట్, సిల్వర్ కోటెడ్ బాల్స్‌లో గంజాయి పెట్టి విక్రయించారు. అయితే సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టి కుల్ఫీ అమ్మే సత్యనారాయణ సింగ్‌ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయితో తయారు చేసిన కుల్ఫీ ఐస్ క్రీమ్‌లతో పాటు బర్ఫీ స్వీట్, సిల్వర్ కోటెడ్ బాల్స్‌నూ సీజ్ చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా వాటిని తయారు చేసిన విధానం చూసి పోలీసులే అవాక్కయ్యారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారి అంజిరెడ్డి తెలిపారు. సాధారణ సమయాలు, పండగల వేళ డ్రగ్స్ కొనుగోలు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు అంజిరెడ్డి హితవు పలికారు.

గ్రూప్ -3 ఫలితాలు విడుదల



విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్ -3 ఫలితాలు విడుదలయ్యాయి. గతేడాది నవంబరులో పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కులతో పాటు జనరల్ ర్యాంకుల జాబితాను టీజీపీఎస్సీ శుక్రవారం ప్రకటించింది. అలాగే, గ్రూప్-3 పరీక్ష తుది కీ, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతో పాటు ఓఎంఆర్ షీట్ల డౌన్‌లోడ్‌కు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలో 1,365 గ్రూప్-3 ఉద్యోగాలకు 5,36,400 మంది దరఖాస్తు చేసుకోగా... గతేడాది నవంబరు 17, 18 తేదీల్లో మూడు పేపర్లుగా జరిగిన ఈ పరీక్షలకు కేవలం 50.24 శాతం మంది హాజరయ్యారు. ఈ నెల 10, 11 తేదీల్లో గ్రూప్- 1, గ్రూప్ -2 ఫలితాలను... తాజాగా గ్రూప్-3 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల ఫలితాలను 19న ప్రకటించనున్నారు.

స్టేట్ టాపర్ అర్జున్ రెడ్డి

గ్రూప్-3 ఫలితాల్లో పాపన్నపేటకు చెందిన అర్జున్ రెడ్డి ... మొత్తం 450

- మిగతా 2 లో

నేటి నుంచి ఈఏపీసెట్ దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంజినీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2025కు దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 15 నుంచి ప్రారంభం కానుంది. ఏప్రిల్ 24 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇటీవల నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి జారీజేసింది. అపరాధ రుసుంతో మే 16 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తులో తప్పుల సవరణకు మే ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు సమయం ఇచ్చారు. మే 12 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 'మనమిత్ర' వాట్సప్ ద్వారా అభ్యర్థులు హాల్‌టికెట్లు పొందొచ్చు. వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల

- మిగతా 2 లో

ఎండలు మండుతున్నాయ్

అప్పడే 40 డిగ్రీలు నమోదు | **ఏడు జిల్లాల్లో ఎల్లో అలర్ట్**

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. మార్చిలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తారెత్తిస్తాయన్న అంచనా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. చాలాచోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రుతుపవనాల సీజన్ ముగియడంతో జనవరి చివరి వారం నుంచే ఎండలు పెరిగాయి. భానుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని, ఉత్తర తెలంగాణలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఎండ తీవ్రతతోపాటు వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉంటుందని అన్నారు. ఈ జిల్లాల్లో ఇప్పటికే ఎల్లో అలర్ట్ జారీ చేశామన్నారు. శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నందున మరో ఏడు జిల్లాల్లోనూ ఎల్లో అలర్ట్ జారీ కానున్నట్లు వెల్లడించారు. ఇక రాజధాని హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. ఎండలు పెరుగుతుండడంతో అందరూ జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లవద్దని హెచ్చరించారు. వడదెబ్బ బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని సూచించారు.

'మంచుకొండ' పనులు పూర్తిచేయండి

మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - ఖమ్మం: రైతులకు సాగునీరు అందించే మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుమ్మల మాట్లాడుతూ ... ఈ ఎత్తిపోతల పూర్తి అయితే మంచుకొండ ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు, ల్యాబ్, ప్రెజర్ మెయిన్స్, కంట్రోల్ ప్యానెల్స్, మోటార్ల ఏర్పాటు వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈఈ, డీఈలు పనుల పురోగతిని మంత్రికి వివరించారు. ప్రెజర్ మెయిన్స్ పనులు

- మిగతా 2 లో

అంతరిక్షం నుంచి చైనా నిఘా!

బీజింగ్: అంతరిక్షం నుంచి భూమి పై నిఘా పెట్టేందుకు చైనా సిద్ధమైంది. ఇందుకోసం అత్యంత శక్తివంతమైన నిఘా ఉపగ్రహాన్ని తయారు చేసింది. ఇందుకు ప్రపంచంలోనే శక్తిమంతమైన స్పై కెమెరాను అమర్చింది. భూమికి 100 కిలోమీటర్ల ఎత్తులో అంతరిక్షంలో చక్కర్లు కొట్టే ఈ నిఘా ఉపగ్రహంలోని స్పై కెమెరా... భూమిపై వ్యక్తుల కదలికలు, ముఖాల్ని అత్యంత స్పష్టతతో గుర్తించగలదని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' తెలిపింది. ఈ ఉపగ్రహాన్ని త్వరలోనే ప్రయోగించాలని చైనా శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

24, 25 తేదీల్లో బ్యాంకర్ల దేశవ్యాప్త సమ్మె

యూఎఫ్‌బీయూ ప్రకటన

న్యూఢిల్లీ: మార్చి 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిగిన చర్చలు ఎలాంటి సానుకూల ఫలితాలు ఇవ్వకపోవడంతో సమ్మెపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అన్ని కేడర్లలో నియామకాలు, వారంలో ఐదురోజుల పని తదితర డిమాండ్లపై చర్చించేందుకు యూఎఫ్‌బీయూ సభ్యులు ఐబీఏను కలిశారు. ఆయా డిమాండ్లపై ఎలాంటి సానుకూల నిర్ణయం తీసుకోలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సీబీఈ) ప్రధాన కార్యదర్శి ఎల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. తొమ్మిది బ్యాంక్ ఉద్యోగ సంఘాలతో కూడిన యూఎఫ్‌బీయూ ఇప్పటికే డిమాండ్లపై సమ్మె ప్రకటించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగి, ఆఫీసర్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్ సైతం ఉన్నది. ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఇటీవల సూచనలను ఉపసంహరించుకోవాలని సైతం యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తోంది. ఈ సూచనలు ఉద్యోగుల

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యం ఇప్పడే గుర్తొచ్చిందా...

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర-హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు శాసనమండలి చైర్మన్‌పై కాగితాలు విసిరినప్పుడు గుర్తు రాని ప్రజాస్వామ్యం ఇప్పుడు గుర్తొచ్చిందా అని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చట్ట సభల్లో ప్రజాస్వామ్యానికి నాయకుడు ముఖ్యమంత్రి అయితే, సభకు అధిపతి స్పీకర్ అని అన్నారు. స్పీకర్‌నుద్దేశించి 'సభ మీ ఒక్కడిదే కాదు' అని ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించడం సభా హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. జగదీశ్ రెడ్డి తీరును బీఆర్ఎస్ ఖండించకపోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన వాళ్లే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌ను అప్రజాస్వామికం అంటారని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నిరసనకు దిగడం హాస్యాస్పదమని మంత్రి ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే విషయంలో బీఆర్ఎస్‌కి కనీస జ్ఞానం రావాలన్నారు. సభలో... సభా వేదికపై ఎలా ప్రవర్తించాలో తెలిసినా ఇలా ప్రవర్తిస్తున్నారంటే వారి ఏ దుర్బుద్ధితో ఇదంతా చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉభయ సభలకు కొన్ని సంప్రదాయాలు, పద్ధతులు ఉంటాయని గుర్తుచేశారు. స్పీకర్ దళితుడు కాబట్టే ఆయనపై బీఆర్ఎస్ నాయకులు రెచ్చిపోతున్నారని పొన్నం ప్రభాకర్ ఆక్షేపించారు. ఈ ప్రవర్తనను మార్చుకోవాలని ఆ పార్టీకి మంత్రి హితవు పలికారు.

చిరంజీవికి మరో అరుదైన గౌరవం

విశాలాంధ్ర-హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవికి మరో అరుదైన గౌరవం దక్కింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి అందిస్తోన్న విశేష సేవలను గుర్తిస్తూ చిరంజీవిని హౌస్ ఆఫ్ కామన్స్ - బ్రిటన్ పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించనున్నారు. బ్రిటన్ అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందు మిశ్రా అధ్వర్యంలో మార్చి 19న ఈ సన్మాన కార్యక్రమం జరగనుంది. మరోవైపు, ఇదే కార్యక్రమంలో బ్రిడ్జ్ ఇండియా సంస్థ చిరంజీవిని ప్రత్యేకంగా సత్కరించనుంది. సినీ రంగంలోనే కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ ముందుండే ఆయనకు జీవిత సాఫల్య పురస్కారం అందించనుంది. 'పునాదిరాళ్లు'తో చిరంజీవి సినీపరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత ఆయన అంచలంచెలుగా ఎదిగారు. వచ్చిన ప్రతి

- మిగతా 2 లో

27 గంటలు మోకాళ్లపైనే

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో రైలు హైజాక్‌కు గురైన ఘటనలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) అదుపులో ఉన్న కొంతమంది బందీలను సైనిక బలగాలు సురక్షితంగా విడిపించాయి. మిలిటెంట్ల చెరలో తాము అనుభవించిన కష్టాలను వారు గుర్తు చేసుకున్నారు. ఉగ్రవాదులు రైలు ఇంజిన్ కింద పేలుడు పదార్థాలు అమర్చి పేల్చడం వల్ల బోగీలు పట్టాలు తప్పాయని రైలు డ్రైవర్ అమ్జాద్ పేర్కొన్నాడు. రైలు ఆగిన వెంటనే ఉగ్రవాదులు కిటికీలు పగలగొట్టి ఆయుధాలతో బోగీలలోకి చొరబడ్డారని తెలిపాడు. అప్పుడు ఏం జరుగుతుందో అర్థం కాలేదని

- మిగతా 2 లో

రేవంత్ చిల్లర రాజకీయం

- బీజేపీతో రహస్య సమావేశాలు సిగ్గుచేటు
- ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ చిత్తు కావాల్సిందే: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ నేతలతో రహస్యంగా సమావేశం కావడం సిగ్గు సిగ్గంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి అధికారిక సమావేశాలు నిర్వహించకుండా చీకటి సమావేశాలు పెట్టడం ఏమిటని నిలదీశారు. తెలంగాణలో ఎన్నడూ జరగని విధంగా రేవంత్ చిల్లర రాజకీయ సాగుతోందని మండిపడ్డారు. బహిరంగంగా బీజేపీతో కుస్తీ... అంతరంగికంగా దోస్తీ అంటూ దుయ్యబట్టారు. రేవంత్ తీరు అత్యంత దుర్మార్గమైనదిగా కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెరచాటు గూడుపుఠాణి చేస్తున్న రేవంత్‌కు వాటిని బయట పెట్టే దమ్ముందా అంటూ సవాల్ విసిరారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ఒక్క సమీక్ష నిర్వహించే సమయం లేని సీఎంకు, ఈ రహస్య

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గొప్ప పెయింటింగ్ ఇది. అర్థంకావడానికి కొంచెం టైం పడుతుంది.

19న భువికి సునీత తిరుగు ప్రయాణం

వాషింగ్టన్ : మూడో సారి రోదసీలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ఎట్టకేలకు భూమి మీదకు తిరిగి వచ్చేందుకు మార్గం సుగమమైనట్లు నాసా ప్రకటించింది. ఈ వ్యోమగాములు మార్చి 19 నాటికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరనున్నట్లు ప్రకటించింది. తొమ్మిది నెలలుగా అంతరిక్షంలోనే చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ భూమిపైకి తిరిగి రావడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కేవలం 8 రోజుల మిషన్ కోసం జూన్ 6న ఐఎస్ఎస్‌కు వెళ్లిన వీరిద్దరూ వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా ఇప్పటివరకూ అక్కడే గడపాల్సి వచ్చింది. అయితే నాసా అధికారులు, స్పేస్ ఎక్స్ ఇంజనీర్లు వీరిని తీసుకురావడంపై ప్రతీసారి ఒక కొత్త తేదీని ప్రకటిస్తున్నారు. ఈసారి వీరు కచ్చితంగా భూమికి తిరిగి వస్తారని చెప్పినప్పుడల్లా మళ్లీ ఏదో ఒక సాంకేతిక సమస్య తలెత్తడంతో వారి రాక మరింత

- మిగతా 2 లో

ఏప్రిల్ 15 తర్వాత...

అమరావతి పనుల పునఃప్రారంభం

నవ నగరాల నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి గతంలో శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే మళ్లీ పనులు పునః ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నరేంద్ర మోదీని సీఎం చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు ఆహ్వానించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాజధానిలో నవ నగరాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని మోదీ చేతుల మీదుగా చేయించాలని నిర్ణయించారు. తొలి దశలో రాజధానిలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.64,721 కోట్లు వెచ్చించనుంది. నిర్మాణ పనులను మిషన్ మోడ్‌లో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈనెల 17న జరిగే

- మిగతా 2 లో



పార్లమెంటులో సీపీఐ ప్రజానుకూల వైఖరి

పార్లమెంటరీ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే వామపక్ష పార్టీలకు, ముఖ్యంగా సీపీఐకి 1967లో నాల్గవ లోకసభ ఎన్నికల నుంచి 2004లో అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం పడిపోయే దాకా స్వర్ణ యుగమేనని చెప్పాలి. 1967 నుంచి 2004 దాకా ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు కలిపి లోక్‌సభలో దాదాపు 50 సీట్లు ఉండేవి.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

సమన్వయంతో పనిచేద్దాం

బీజింగ్ సమావేశంలో చైనా, రష్యా, ఇరాన్ నిర్ణయం

బీజింగ్: నేడున్న పరిస్థితుల దృష్ట్యా తాము కలిసికట్టుగా ముందుకెళ్లాలని, పరస్పరం సంప్రదింపులు జరుపుకుంటూ సమన్వయంతో సవాళ్లను అధిగమించాలని చైనా, రష్యా, ఇరాన్ దేశాలు నిర్ణయించాయి. చైనా రాజధాని బీజింగ్‌లో మూడు దేశాల ప్రతినిధులు శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సమావేశానికి చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి మా జావుషూ అధ్యక్షత వహించారు. అణ్వస్త్రాలు, ఆంక్షలు, అంతర్జాతీయ సవాళ్లు, ప్రాదేశిక అంశాలపై ముగ్గురు ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. తమ సహకార బంధాన్ని మరింతగా బలపర్చుకోవాలని నిశ్చయించారు. చట్టవిరుద్ధ ఏకపక్ష ఆంక్షల రద్దు అవశ్యకతను చర్చించారు. రాజకీయ, దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపర్చుకోవాలని, పరస్పరం సంప్రదింపులు జరుపుకోవాలని, కలిసి కట్టుగా ముందుకెళ్లాలని, మరింతగా సహకరించుకుందామని, ప్రతినిధులు నిర్ణయించారు. యూఎన్‌ఎస్‌సీ తీర్మానం, నాన్ ప్రొలిఫిరేషన్ ఆఫ్ న్యూక్లియర్ వెపన్స్ (ఎన్‌పీటీ) ఒప్పందంపై చర్చించారు. అందుకు కట్టుబడాలని వక్కాణించారు. శాంతి కోసమే అణ్వస్త్రాలు తయారు చేస్తున్నట్లు ఇరాన్ చెప్పడాన్ని స్వాగతించారు. ఎన్‌పీటీకి కట్టుబడి ఉంటామన్న ఇరాన్ మాటలను గౌరవించారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)తో సహకారాన్ని కొనసాగించేలా ఇరాన్ విధానానికి మద్దతు ప్రకటించారు. ఐఏఈఏకు సంబంధించిన సాంకేతిక ఇతరత్రా పనులకు ఏ విధంగా విఘాతం కలగకుండా చూడాలని మూడు దేశాల ప్రతినిధులు సంకల్పించారు. బీజింగ్‌లో ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ... ఈ సమావేశం ఏర్పాటులో నిర్మాణాత్మక పాత్ర పోషించిన చైనాను అభినందించారు. భవిష్యత్‌లో మరింత సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. ప్రాదేశిక, అంతర్జాతీయ పరిణామాలు, సవాళ్లపై విస్తృతంగా చర్చించారు. అంతర్జాతీయ సంస్థలు, బ్రిక్స్, షాంఘై సహకార సంఘం వంటివాటికి సంబంధించి తమ మధ్య సహకార బంధాన్ని మరింతగా బలోపేతం చేసుకోవాలని చైనా, ఇరాన్, రష్యా నిర్ణయించాయి.

రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నిలిపివేత

రష్యా చమురు కొనుగోలును చైనా నిలిపివేసింది. ఈ నెలలో రెండు సంస్థలు కొనుగోళ్లనూ పూర్తిగా నిలిపివేయగా... మరో రెండు సంస్థలు కొనుగోలు చేసే చమురు పరిణామాన్ని తగ్గించాయి. జనవరిలో రష్యా చమురు ఉత్పత్తిదారులు, ట్యాంకర్లపై అమెరికా కఠిన ఆంక్షలు విధించింది. దీంతో కొనుగోళ్లు తగ్గాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం క్రమంలో రష్యా చమురు కొనుగోలు చేసే అతిపెద్ద దేశాలుగా చైనా, భారత్ నిలిచాయి. చైనా తరహాలోనే భారత్ కూడా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇప్పటికే లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి ముడిచమురు దిగుమతులను పెంచింది.

జన్మత: పౌరసత్వంపై సుప్రీంకెళ్లిన ట్రంప్

వాషింగ్టన్: జన్మత: పౌరసత్వం రద్దుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన ఆదేశాలను ఫెడరల్ కోర్టులు నిలిపివేయడాన్ని సవాల్ చేశారు. జన్మత: పౌరసత్వం రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మేరీల్యాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్ రాష్ట్రాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో కోర్టులు ఇంజెక్షన్ ఆర్డర్లు జారీ చేశాయి. ట్రంప్ సర్కారు ఇటీవల తొలగించిన ప్రొబేషనరీ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆరు ఏజెన్సీలకు కాలిఫోర్నియా కోర్టు ఆదేశాలిచ్చింది. ఇదిలావుంటే జన్మత:పౌరత్వంపై సుప్రీంకోర్టులో ట్రంప్ పిటిషన్ విచారణకు రాగా... ఆపద్ధర్మ సొలిసిటర్ జనరల్ సారా హారిస్ స్పందిస్తూ ఈ పిటిషన్ సాధారణమైనదే అని అన్నారు. మూడు దిగువ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లు వ్యక్తిగత స్థాయికే పరిమితం చేయాలని కోరారు. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగబద్ధమా?కాదా?అన్న విషయంపై అభిప్రాయాన్ని మాత్రం కోరలేదు. అమెరికా చట్టాల ప్రకారం ఆదేశంలో పుట్టిన వారికి జన్మత:పౌరసత్వం లభిస్తుంది. ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించదు. తండ్రి శాశ్వత నివాసి అయి... తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో ఉంటున్నా కూడా పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించదు.

గ్రీన్‌కార్డ్ ఉన్నా శాశ్వత నివాసులు కారు: వాన్స్

గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో శాశ్వత నివాస హక్కు లభించినట్లు కాదు అని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. అమెరికా పౌరసత్వం ఎవరికి ఇవ్వాలని, ఎవరిని మాతో కలుపుకోవాలన్నది మేమే నిర్ణయిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ఇది వాక్‌స్వేచ్ఛకు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని వక్కాణించారు.

కిమ్ ఓ అణుశక్తి: ట్రంప్

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఒక అణు శక్తి అని ట్రంప్ అన్నారు. అణ్వస్త్రాలు తగ్గించగలగడం గొప్ప విజయమే అవుతుందన్నారు. కిమ్ వద్ద అణ్వాయుధాలు చాలా ఉన్నాయన్నారు. భారత్, పాకిస్థాన్ వంటి ఇతర దేశాల వద్ద కూడా అణ్వస్త్రాలు ఉన్నాయని తెలిపారు. నాటో అధినేతతో భేటీ క్రమంలో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉత్తర కొరియా ఏ మాత్రం వెనక్కి తగ్గడంలేదు. దక్షిణ కొరియా-అమెరికా సైనిక విన్యాసాలు, ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలతో నిత్యం ఉద్రిక్తత కొనసాగుతోంది. దక్షిణ కొరియా-అమెరికా తమపై దాడికి సన్నాహంగా సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నాయని కిమ్ ప్రభుత్వం వాదిస్తుండటం తెలిసిందే.

ఐసీసీలో రాడ్రిగో డుటర్టే పేషీ

ది హేగ్: ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రాడ్రిగో డుటర్టే శుక్రవారం అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఎదుట హాజరయ్యారు. ఆయన అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుట తొలి సారి హాజరు అయినందున న్యాయమూర్తులు తొలుత ఆయన గుర్తింపు, భాష తదితర అంశాలను పరిశీలించారు. డుటర్టేకు కేసు వివరాలను, ఆరోపణలను వివరించారు. లైసీసీ రోమ్ చట్టం కింద ఆయనకున్న న్యాయపరంగా ఉన్న హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ మేరకు హేగ్ ఐసీసీ అధికారిక వెబ్‌సైట్ వెల్లడించింది. డుటర్టే (79) మంగళవారం మనీలాలో అరెస్టు అయ్యారు. మాదకద్రవ్యాలపై యుద్ధం క్రమంలో డుటర్టే తీసుకున్న అమానవీయ చర్యలకుగాను ఐసీసీ ఆయన అరెస్టుకు వారెంటు జారీ చేసింది. డుటర్టేను మనీలా నుంచి నెథర్లాండ్స్‌కు తీసుకెళ్లిన తర్వాత ఆయనను బుధవారం ఐసీసీ కస్టడీకి అప్పగించిన విషయం విదితమే.

ఏప్రిల్ 15 తర్వాత...

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తర్వాత కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అగ్రిమెంట్ లెటర్లు జారీ చేయనుంది. వర్క్ ఆర్డర్లు జారీ కాగానే ఏజెన్సీలు పనులను ప్రారంభించనున్నాయి. వచ్చే నెల మూడవ వారం వరకు ప్రధాని షెడ్యూల్ బిజీగా ఉండటంతో ఆ తరువాత షెడ్యూల్ ఖరారు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా రాజధాని పనులకు ప్రధాని శంకుస్థాన చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో రాజధాని పనులు ఆగిపోయాయి. దీనిపై రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు ఐదు సంవత్సరాల పాటు ఆందోళనలు కొనసాగించినా జగన్ ప్రభుత్వం కరుణించలేదు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు, అమరావతి, పోలవరం ప్రాజెక్టులపై దృష్టి పెట్టారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమిలో కూడా చంద్రబాబు కీలకంగా మారడంతో ఆయన కోరిన వెంటనే రాజధాని పనులకు ప్రపంచ బ్యాంక్ ద్వారా రుణం మంజూరుకు కేంద్రం సహకరించింది. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ సమావేశంలో దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన పనులకు ఆమోదముద్ర పడింది. కాంట్రాక్టు ఏజెన్సీలకు అంగీకార పత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు కలిసి దాదాపు రూ.13 వేల 400 కోట్ల రుణాలను ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. అలాగే హడ్కో నుంచి మరో రూ.11 వేల కోట్ల రుణ సమీకరణకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసింది. దానికి సంబంధించి అనుమతి లేఖ కూడా రాష్ట్రానికి వచ్చింది. రాష్ట్రం నుంచి అంగీకారం తెలుపుతూ ముంబైలోని హడ్కో కార్యాలయానికి లేఖ పంపారు. అలాగే జర్మనీకి చెందిన ఆర్థిక సంస్థ నుంచి మరో రూ.5 వేల కోట్ల రుణాలు తీసుకోవడంతో పాటు రూ.1,500 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్‌గా తీసుకోనున్నారు. మొత్తం రూ.31 వేల కోట్ల నిధులు ప్రభుత్వం వద్ద అమరావతి నిర్మాణానికి సంబంధించి సిద్ధంగా ఉన్నాయి. 2014-19 మధ్యకాలంలో దాదాపు రూ.43 వేల కోట్ల విలువైన టెండర్లను పిలిచి రూ.9 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టారు. ఐకానిక్ కట్టడాలకు రాక్ ఫౌండేషన్ పూర్తికాగా, ప్రజాప్రతినిధుల క్వార్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐఏఎస్‌ల బంగ్లాలు దాదాపు 60 నుంచి 80 శాతం పూర్తయ్యాయి. వీటన్నింటికీ పాత టెండర్లు రద్దు కావడంతో అంచనాలు భారీగా పెరిగాయి. మరలా కొత్త అంచనాలతో టెండర్లు ఖరారు చేస్తున్నారు. రైతులిచ్చిన భూములతో పాటు ప్రభుత్వ, అటవీ భూములన్నీ కలిపి సుమారు 53,500 ఎకరాల భూములు రాజధానికి ఉండగా, వీటిలో 30 శాతం వరకు గ్రీన్ అండ్ బ్లూగా అభివృద్ధి చేయాలని సీఆర్డీఏ నిర్ణయించింది.

‘మీ సాయం... మేం ఎన్నటికీ మరువం’

హరీశ్‌రావుకు హైడ్రా బాధితుల ఆత్మీయ శుభాకాంక్షలు

పండుగ ఆనందాన్ని పంచుకున్న కాలనీవాసులు

విశాలాంధ్ర-హైదరాబాద్: హోలీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైదర్షాకోట్ డ్రీమ్ హోమ్ కాలనీవాసులు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల హైడ్రా కూల్చివేతలతో తీవ్ర ఆందోళనకు గురై కన్నీరు మున్నీరైన తమకు హరీశ్‌రావు ధైర్యం చెప్పి అండగా నిలిచారని కాలనీ ప్రజలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు..హైడ్రా కూల్చివేతలతో తమ సొంత ఇళ్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడడంతో తీవ్ర మనోవేదనకు గురైన వారు... ఐదు నెలల క్రితం తెలంగాణ భవనానికి వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారి సమస్యను అర్థం చేసుకొని కాలనీకి స్వయంగా వచ్చి హైడ్రా చర్యలను ఆయన అడ్డుకున్నారు. బాధితుల తరపున కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాన్ని నిలదీశారు. ‘తాము ఆపదలో ఉన్నప్పుడు హరీశ్‌రావు మానవీయ దృక్పథంతో తమకు అండగా నిలిచారు. ఈ సాయం తాము ఎప్పటికీ మరిచిపోలేం’ అని కాలనీవాసులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ, హరీశ్‌రావు తమ సేవాతత్పరతతో తమ గుండెల్లో నిలిచిపోయారంటూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే ఆయన సమాజంలో ఆనందం నింపుతూ ప్రజల హృదయాల్లో నిలుస్తారని, ఆయనకు ఈ పండుగ వేళ మరింత శక్తి చేకూరాలని కాలనీ వాసులు ఆకాంక్షించారు. ప్రతిగా మాజీ మంత్రి హరీశ్ రావు ...కాలనీవాసులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, కార్తీక్ రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

24, 25 తేదీల్లో బ్యాంకర్ల దేశవ్యాప్త సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని, ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆరోపించారు. గ్రాట్యూటీ చట్టాన్ని సవరించాలని, పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తోంది. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్‌లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీఓసీ), నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సీబీఈ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐబీఓఏ) ప్రధాన బ్యాంకు సంఘాలు ఉన్నాయి.

చిరంజీవికి మరో అరుదైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తనదైన నటన, డ్యాన్సులతో యువతను ఉర్రూతలూగించారు. 9 ఫిలింఫేర్, 3 నంది అవార్డులతోపాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. సినీ రంగానికి ఆయన చేస్తున్న సేవలు గుర్తించిన ప్రభుత్వం 2006లో చిరంజీవికి పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అందించి గౌరవించింది. ఇటీవల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆయన చోటు దక్కించుకున్నారు. 156 చిత్రాలు... 537 పాటలు... 24 వేల స్టెప్పులతో అలరించినందుకు ఈ రికార్డు దక్కింది.

19న భువికి సునీత తిరుగు ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

ఆలస్యమవుతోంది. వీరిని భూమికి తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా క్రూ-10 మిషన్‌ను బుధవారం అంటే మార్చి 13న ప్రయోగించేందుకు అంతా సిద్ధమయింది. అయితే ఈ మిషన్‌లో హైడ్రాలిక్ వ్యవస్థలో సమస్య ఉత్పన్నం కావడం వల్లే ఈ క్రూ-10 మిషన్‌ను ఆపేసినట్లు పేర్కొంది. తాజాగా నాసా మరో సమాచారం అందించింది. వ్యోమగాములు మార్చి 19 నాటికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరనున్నట్లు ప్రకటించింది. మార్చి 14న రాత్రి 7:03 గంటలకు ప్రయోగించినున్న ఈ క్రూ-10 మిషన్ నలుగురు సిబ్బందిని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తీసుకుని వెళ్తుంది. ఇది ఇంతకుముందు సునీతా, విల్మోర్‌ను భూమికి తిరిగి సురక్షితంగా తీసుకొచ్చేందుకు గత ఏడాది సెప్టెంబరులో స్పేస్ ఎక్స్ ప్రోయోగించిన క్రూ-9 మిషన్‌తో అనుసంధానం కానుంది. ఈ క్రూ-9 మిషన్ ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉంది. ఇందులో నాలుగు సీట్లు ఉండగా హాగ్, గోర్బునోవ్ అనే వ్యోమగాములను దీనిలో పంపించి మిగతా రెండు సీట్లను సునీతా, విల్‌మోర్ కోసం ఖాళీగా వదిలిపెట్టారు. ఈ మిషన్ ఐఎస్ఎస్‌కు చేరుకున్న తర్వాత క్రూ-10తో కొన్ని రోజుల హ్యాండోవర్ పీరియడ్‌ను పూర్తి చేసి క్రూ-9 ద్వారా ఈ వ్యోమగాములు తిరిగి భూమికి చేరనున్నారు. అన్నీ సవ్యంగా జరిగితే నాసా వ్యోమగాములు మార్చి 19 బుధవారం కంటే ముందే అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరే అవకాశం ఉంది. అయితే ఇందుకోసం ఫ్లోరిడా తీరంలోని స్ప్లాష్‌డౌన్ ప్రదేశాలలో వాతావరణం కూడా సహకరించాల్సి ఉంది.

27 గంటలు మోకాళ్లపైనే

(మొదటిపేజీ తరువాయి)

అన్నాడు. తమను కాపాడడానికి ప్రయత్నించిన సైనికులను దారుణంగా హత్య చేశారని, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని కాల్చి చంపడంతో భయంతో తాము అక్కడే ఉండిపోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. మహిళలు, చిన్న పిల్లల పైనా మిలిటెంట్లు దాడి చేశారన్నారు. మహబూబ్ అహ్మద్ అనే వ్యక్తి మాట్లాడుతూ... వేర్పాటువాదులు తమను బందీలుగా చేసుకున్నారని తెలియడంతో ఇక తాము జీవితంపై ఆశలు వదులుకున్నామన్నాడు. రైలులో మృతదేహాలను చూసి భయంతో వణికిపోయినట్లు తెలిపాడు. బందీలుగా చేసుకున్న తమను మారుమూల పర్వత ప్రాంతాలలో గంటల తరబడి నడిపించుకుంటూ తీసుకువెళ్లి... వివిధ ప్రదేశాలలో బంధించారని తెలిపాడు. 27 గంటల పాటు తమను మోకాళ్లపైనే కదలకుండా కూర్చోబెట్టారని గుర్తు చేసుకున్నాడు. అప్పుడప్పుడు తాగడానికి నీరు తప్ప ఎటువంటి ఆహారం ఇవ్వలేదని, పిల్లలు ఆకలితో గుక్కపట్టి ఏడుస్తున్నా కనికరం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పాక్ భద్రతా దళాలు తమను విడిపించడానికి తీవ్రంగా శ్రమించాయని, అందుకు వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని అన్నాడు.

త్వరలో నామినేటెడ్ పోస్టులు



పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం జరగనివ్వం

టీడీపీ ప్రజాప్రతినిధులతో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సాధ్యమైనంత త్వరగా నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని టీడీపీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు చెప్పారు. పేర్లను సిఫారసు చేసేందుకు కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని, ఆయా పదవుల కోసం పార్టీకి కష్టపడిన వారి వివరాలు త్వరగా అందించాలని కోరారు. తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారిని, త్యాగాలు చేసిన వారిని తప్పకుండా తగిన గుర్తింపు ఇస్తామని భరోసా ఇచ్చారు. అలాగే సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 ప్రధాన ఆలయాలకు చైర్మన్ల నియామకం చేపట్టనున్నట్లు వెల్లడించారు. నామినేటెడ్ పదవుల కోసం దాదాపు 60 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. మొదటిసారే పదవులు రాలేదని అనుకోవద్దు. రెండేళ్ల పదవీకాలం ముగిశాక మిగిలినవారికి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే పదవులు తీసుకున్నవారి ప్రతిభను పర్యవేక్షిస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నట్లే ఇప్పుడు కూడా హుందాగా వ్యవహరించాలని కోరారు. పార్టీ నేతలు ఏ స్థాయిలోనూ వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదని, నేను చెబితే, వైసీపీకి ఓటేసిన వారికి పథకాలు ఇవ్వొద్దన్నట్లు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు వేరు. రాజకీయ సంబంధాలు వేరు అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో లబ్ధిదారులు అర్హులా ? కాదా ? అన్న విషయం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా చూసే బాధ్యత మంత్రులదేనని స్పష్టం చేశారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో పర్యటనల సంఖ్య పెంచాలని, కూటమిలోని మూడు పార్టీల నేతలు, కార్యకర్తలను కలుపుకొని ముందుకెళ్లాలని చంద్రబాబు నేతలకు దిశానిర్దేశం చేశారు. గత 9 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా ఎప్పటికప్పుడు వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, గతానికి, ఇప్పటికీ తేడాను తెలియజేసి వారిని చైతన్యపర్చాలని చంద్రబాబు నేతలకు మార్గనిర్దేశనం చేశారు.

నేటి నుంచి ఈఏపీసెట్ దరఖాస్తుల ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి ప్రవేశ పరీక్ష మే 19, 20 తేదీల్లో రోజుకు రెండు విడతలుగా ఉంటుంది. ఇంజినీరింగ్ పరీక్ష మే 21 నుంచి 27 వరకు రోజుకు రెండు విడతలుగా నిర్వహిస్తారు. వ్యవసాయ, ఫార్మసీ పరీక్ష ప్రాథమిక ‘కీ’ని మే 21న, ఇంజినీరింగ్ ప్రాథమిక ‘కీ’ని మే 28న విడుదల చేస్తారు. తుది ‘కీ’ని జూన్ ఐదోతేదీన ప్రకటిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ (పదో తరగతి), ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర హాల్‌టికెట్, స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయ సర్టిఫికెట్‌గానీ లేదా రేషన్ కార్డు, ఈడబ్ల్యూఎస్ ఇన్‌కామ్ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి.
ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ కల్పించారు. ఇంటర్ మార్కులు, ఈఏపీసెట్ మార్కుల ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తారు.

గ్రూప్ -3 ఫలితాలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

మార్కులకు గాను 339.23 మార్కులతో స్టేట్ ప్రథమ ర్యాంక్ సాధించాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్ -2 లో స్టేట్ 18వ ర్యాంక్ సాధించాడు. అర్జున్ రెడ్డి ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం హవేలీ ఘనపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ, మెదక్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, గ్రూప్ -2 పోస్టుకు ప్రాధాన్యత ఇస్తానని అర్జున్ రెడ్డి తెలిపారు. మహిళల్లో టాపర్‌కు (8వ ర్యాంకు) 325.15 మార్కులు వచ్చాయి. టాప్-10 ర్యాంకుల్లో ఒక మహిళ మాత్రమే ఉండగా... టాప్ -50 ర్యాంకుల్లో నలుగురు ఉన్నారు. కాగా, ఇటీవల విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో టాపర్ల పేర్లను విడుదల చేసిన టీజీపీఎస్సీ... గ్రూప్- 3 ఫలితాల్లో మాత్రం వారి పేర్లను ప్రకటించలేదు.

రన్యా రావుకు బెయిల్ తిరస్కృతి

బెంగళూరు: బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టు అయిన నటి రన్యా రావుకు బెయిల్ ఇచ్చేందుకు బెంగళూరు కోర్టు నిరాకరించింది. ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు శుక్రవారం రన్యా రావు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. వాదనలు, ప్రతివాదనల తర్వాత ఉత్తర్వులను బుధవారం రిజర్వులో పెట్టింది. కాగా, కన్నడ నటి రన్యా రావు కేసు ప్రస్తుతం సంచలనంగా మారింది. రాజకీయ నేతలు, అధికారుల పాత్రపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆమెకు మంత్రులతో సంబంధాలపై కథనాలు వెలువడ్డాయి. అయితే విమానాశ్రయంలో వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగించేందుకు రన్యా రావు తన తండ్రి, సీనియర్ ఐపీఎస్ కె.రామచంద్రరావు పేరును వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సూత్రధారుల పాత్రపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. అప్పటివరకు నిందితుల కాలమ్‌లో అనుమానితులుగా ‘అన్‌నోన్ పబ్లిక్ సర్వెంట్లు, ప్రైవేటు పర్సన్స్’ పదాలను పేర్కొంది. దాంతో ఈ కేసులో అనుమానితులుగా భావించిన ఎవరికైనా సీబీఐ సమన్లు జారీ చేసేందుకు అవకాశం ఉంటుంది.

ఈ పరిణామాలతో రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్ల గుండెల్లో గుబులు మొదలైంది. కొందరు సిండికేట్‌గా ఏర్పడి ఈ దందా సాగిస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ గుర్తించింది. సీబీఐకి దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. కాగా, రన్యా రావు దాదాపు 15కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన విషయం విదితమే.

రేవంత్ చిల్లర రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాలకు సమయం దొరకడం క్షమించలేని ద్రోహమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారని రంకెలు వేసే ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి... బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన రేవంత్ రెడ్డిపై చర్య తీసుకునే ధైర్యం ఉందా? అని సవాల్ విసిరారు. ఏ క్షణంలోనైనా సీఎం కుర్చీ చేజారే సూచనల వల్లే బీజేపీతో చీకటి ఒప్పందాలంటూ రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు చేశారు. ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం సహించదని అన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా కదం తొక్కిన గులాబీ శ్రేణులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో ప్రాణాలకు తెగించి పోరాడినట్లే నేడు ప్రతిపక్ష హోదాలో రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుండటం అభినందనీయమని అన్నారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సస్పెండ్ చేసిన కాంగ్రెస్ సర్కార్... ప్రజాక్షేత్రంలో తప్పించుకోలేదన్నారు. పరిపాలన చేతకాక అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ గొంతునొక్కాలని చూస్తున్న ముఖ్యమంత్రికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని దివాళా దిశగా నడిపిస్తున్న రేవంత్ మోసకారి ప్రభుత్వం మెడలు వంచే దాకా ఉద్యమ పంథాను కొనసాగిద్దాం... తెలంగాణను కాపాడుకునేందుకు సంఘటితశక్తిగా ముందుకెళదాం అంటూ పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఐసిస్ నేత అబు ఖదీజా హతం

బాగ్దాద్: సిరియా, ఇరాక్‌కు ఐసిస్ నాయకుడు అబు ఖదీజా హతమయ్యాడు. ఈ మేరకు ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్ సుదానీ శుక్రవారం ప్రకటించారు. అబ్దుల్లా మకీ ముస్లే అల్ రిఫై అలియాస్ అబు ఖదీజాను అమెరికాతో కలిసి చేపట్టిన ఆపరేషన్‌లో ఇరాక్ దళాలు మట్టుబెట్టాయన్నారు. అబు ఖదీజా ఇరాక్‌తోపాటు ప్రపంచంలోనే కరడుగట్టిన ఉగ్రవాది అని అన్నారు. ఐసిస్‌లో అబు ఖదీజా కీలక నాయకుడు. అతనికి కలీఫా అయ్యే అవకాశాలు ఉన్నవి. ఇప్పుడు అతని మరణం ఐసిస్‌కు కోలుకోలేని దెబ్బగా చెప్పవచ్చు. ఈమధ్య కాలంలో ఐసిస్ చాలా నాయకులను కోల్పోయింది. 2019లో అబు బకర్ అల్ బాగ్దాదీ మరణంతో ఐసిస్‌కు స్థిర నాయకత్వం లేకుండా పోయింది.

‘మంచుకొండ’ పనులు పూర్తిచేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల 25 లోపు పూర్తి చేస్తామని, 17 నాటికి మొదటి స్లాబ్ నిర్మాణం అయిపోతుందని, తదుపరి నాగార్జున సాగర్ కాలువ నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా పనులు పూర్తి చేస్తామన్నారు. మంత్రి వెంట ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలగర్ల హనుమంతరావు, నీటి పారుదల శాఖ ఈఈ అనన్య, డీఈఈ ఝాన్సీ, ఏఈఈ శ్రీరామ్, రాజీవ్ గాంధీ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

ఫలితాలిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని కృషి

మరో 10 డయాలసిస్ బెడ్లు అందుబాటులోకి...

200 మంది రోగులకు డయాలసిస్ సేవలు...

16న డయాలసిస్ మిషన్స్ ప్రారంభించనున్న కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : పేదవర్గాల ప్రభుత్వ దవాఖానాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఏడాదికాలంగా చేస్తున్న కృషి నియోజకవర్గంలో ఫలితాలిస్తుంది. డయాలసిస్ సేవలను విస్తరించాలనే లక్ష్యంతో నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడెం ఆస్పత్రిలో మిషన్‌లు పెంచి సేవలను విస్తరించారు. అదేవిధంగా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని కూనంనేని సాధించిపెట్టారు. గతంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో కేవలం 5 మిషన్లు యంత్రాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావు గెలిసిన అనంతరం డయాలసిస్ రోగుల ఇబ్బందులను గుర్తించి మిషిన్ల సంఖ్యను పెంచేందుకు కృషి చేశారు. పలుమార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులను, వైద్యశాఖ ఉన్నతాధికారులను సంప్రదించి నియోజకవర్గానికి ఏడాది కాలంలో అదనంగా 15 యంత్రాలను మంజూరు చేయించగలిగారు. ప్రస్తుతం పాల్వంచలో ఐదు మిషన్లు అందుబాటులో ఉండగా మరో ఐదు మిషన్లను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రస్తుతం ఐదు మిషన్లు అందుబాటులో ఉండగా మరో ఐదు మిషన్లు అందుబాటులోకి రానున్నాయి.

మర్చి 16న కూనంనేని సాంబశివరావు చేతులమీదుగా నూతనంగా మంజూరైన మిషన్లు ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలో 20 మిషన్లు డయాలసిస్ రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుండగా ప్రతి రోజు రెండొందల మందికి డయాలసిస్ సేవలు అందనున్నాయి.

కొత్తగూడెం ఆస్పత్రిలో 15 మిషిన్లకు పెంచేందుకు కృషి జరుగుతోందని కూనంనేని సాంబవివరావు అన్నారు. రాష్ట్ర వ్యాపితంగా ఏ నియోజకవర్గంలోనూ ఇరవై మిషన్లు అందుబాటులో లేని పరిస్థితి ఉండగా కేవలం కొత్తగూడెం నియోజకవర్గంలో కూనంనేని సాంబశివరావు కృషితో పేద రోగులకు 20 మిషన్లు డయాలసిస్ సేవలు అందనున్నాయి. డయాలసిస్ యంత్రాల మంజూరు కోసం, ప్రభుత్వ వైద్యం బలోపేతం కోసం కూనంనేని చేస్తున్న కృషిని పేదవర్గాల హర్షిస్తున్నాయి.

ప్రపంచ గతిని మార్చిన మేధావి కారల్‌మార్క్స్

సీపీఐ కార్యాలయంలో ఘన నివాళి

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రపంచ గతిని మార్చిన మార్క్సిస్టు మేధావి కారల్‌మార్క్స్ అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రపంచంలోని సర్వ సమస్యలకు పరిష్కారం చూపగలిగిన ఏకైక సిద్ధాంతం మార్క్సిజం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కారల్‌మార్క్స్ 142వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ మార్క్స్ గతించి 141 సంవత్సరాలు గడిచినప్పటికీ తన సిద్ధాంతంతో కోట్లాది మంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన సిద్ధాంతం అజరామరమని అమలుకు నోచుకున్న చోట భూతల స్వర్గాన్ని సృష్టించిందని ఆయన తెలిపారు. యావత్ ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిత్యం అవహేళన చేసే బూర్జువా శక్తులు సైతం కారల్ మార్క్స్ ప్రతిపాదిత మార్గాలను అధ్యయనం చేసి ఓ పరిష్కార మార్గం కోసం అన్వేషించాయన్నారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం కారల్‌మార్క్స్ నిరంతరం తపించాడన్నారు. శ్రమకు తగిన ఫలితం దక్కాలని ఉత్పత్తి శక్తులే ఫలితాలను అనుభవించాలని ఆయన సూచించారన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, మత ఉన్మాదం దేశ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టుగా మారనున్నాయని హేమంతరావు తెలిపారు. ప్రజా చైతన్యంతో మార్క్సిజం మార్గంలో పయనించడమే ప్రస్తుత దేశ సమస్యలకు పరిష్కారమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, మందా వెంకటేశ్వర్లు, పోటు పూర్ణచందర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం, వెంకటాపురం ప్రభుత్వాసుపత్రులకు పరికరాలు, ఫర్నిచర్ పంపిణీ

ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సురేష్ కుమార్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రభుత్వాసుపత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏటూరునాగారం, వైద్య ఆసుపత్రి వెంకటాపురం వైద్యశాలలలో శుక్రవారం హుండాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ 2024 - 2025 ద్వారా, సమారిటర్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో, 25 లక్షల రూపాయలు విలువ చేసిన వైద్య పరికరాలు, ఫర్నిచర్, హాస్పిటల్ కేర్ సామాగ్రిని, పంపిణీ చేయడం జరిగిందని, ఏటూరునాగారం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రి, వైద్య ఆసుపత్రి వెంకటాపురం సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఏటూరునాగారం, వెంకటాపురం ఆసుపత్రులకు వచ్చే రోగుల కోసం, ఉపయోగపడే, పరికరాలు, సామాగ్రి పంపిణీ చేసిన హుండాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, సిఎస్ఆర్ టీమ్ సభ్యులు శ్రీకాంత్, సచిన్, సమారిటర్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థ అధినేత రామ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది, రోగుల నుండి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని, వారిని కొనియాడారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థ అధినేత రామకుమార్ హ్యుండై సిఎస్ఆర్ టీం సభ్యులు శ్రీకాంత్, సచిన్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి గోడపత్రికల విడుదల : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తిలో మార్చి 23న భగత్‌సింగ్ 94 వర్ధంతి నేపథ్యంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వనపర్తి ఆఫీస్ వద్ద భగత్‌సింగ్ వర్ధంతి గోడ పత్రికలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ మాట్లాడారు. దేశ స్వాతంత్రం కోసం భగత్‌సింగ్ రాజ్గురు సుఖ్దేవ్ తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అని గర్జించిన భగత్‌సింగ్ దేశ ప్రజల కోసం ఉరికొయ్యను ముద్దాడారని, ఆయన ఆశయ స్ఫూర్తితో సమాజ మార్పు కోసం కృషి చేయాలన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పోటీలు, సెమినార్లు, చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నారన్నారు. యువత డ్రగ్స్ మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని, రాజకీయ నేతల స్వార్థ రాజకీయాల వలలో పడవద్దన్నారు. తాగుడు, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసలను చేస్తున్నారన్నారు. దేశ ప్రగతి కోసం, అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం పోరాడాలన్నారు. మార్చి 23న జరిగే భగత్‌సింగ్ వర్ధంతి ఉత్సవాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏఐవైఎఫ్ వనపర్తి జిల్లా ఇన్చార్జి రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విష్ణు, చందు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, వనపర్తి డివిజన్ కార్యదర్శి వంశీ, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

దాసరి మల్లయ్య కాంగ్రెస్‌కు చేసిన సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-తొర్రూరు: దాసరి మల్లయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రవీందర్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు దాసరి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఝాన్సీరెడ్డి శుక్రవారం సందర్శించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దాసరి మల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి మల్లయ్య తొర్రూరు ఉప సర్పంచ్‌గా, డిసిసి ప్రధాన కార్యదర్శిగా, పిఎసిఎస్ వైస్ చైర్మన్, చైర్మన్‌గా, పిసిసి సభ్యులుగా సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండి అనేకమంది యువకులను ప్రోత్సహించి రాజకీయ ప్రజాసేవలు అందించిన వ్యక్తి దాసరి మల్లయ్య అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కాంగ్రెస్ నాయకులు మరువలేనని అన్నారు. తొర్రూరులో దాసరి మల్లయ్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, పెరటి యాకూబ్ రెడ్డి, అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, దొంగరి శంకర్, బిక్షం గౌడ్, గంజి ప్రసాద్ రెడ్డి, కిషన్ యాదవ్, దేవేందర్ రెడ్డి, జలీల్, రమేష్ గౌడ్, అల్లం చిన్నకోటయ్య, కుమార్ యాదవ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా హోలీ వేడుకలు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : హోలీ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌లు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే హోలీ, దీపావళి లాంటి అన్ని పండగలను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిపి నిర్వహించుకోవడంలో ఆనందం ఉంటుందన్నారు. ఈ హోలీ పండుగ జిల్లా ప్రజలకు సుఖసంతోషాలను కలిగించాలని, అలాగే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవర్‌తో పాటు, జిల్లా కలెక్టర్ భర్త ఐఏఎస్ అధికారి భవేష్ మిశ్రా, జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులు, ఎస్పీ కుటుంబ సభ్యులు, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్ పాల్గొన్నారు.

ములుగుజిల్లాలో హోలీ సంబరాలు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లాలల్లో ఘనంగా హోలీ సంబరాలు, చిన్న, పెద్ద, వృద్ధులు, మహిళాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, అనే తేడా లేకుండా, హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబరాల్లో జిల్లా కేంద్రం, వివిధ మండల, గ్రామ ప్రజలు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బీఆర్ఎస్

విశాలాంధ్ర - నేరేడుచర్ల : అసెంబ్లీలో మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేసినందుకు బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు, నేరేడుచర్ల మండల పరిధిలో నియోజకవర్గ బిఆర్ఎస్ కోఆర్డినేటర్ ఒంటెద్దు నరసింహారెడ్డి ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఏక పక్షంగా జగదీష్ రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుండి సస్పెండ్ చేయటం దుర్మార్గమని, వీరి చేతగాని తనాన్ని, ఆరు హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తారని ఇలా బిఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, చేతనైతే పాలనలో సత్తా చూపించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని, అంతే తప్ప ఇలా ప్రశ్నించే గొంతుకుల సస్పెండ్ చేయడం అన్యాయమని దుయపట్టారు. ఇలాగే బిఆర్ఎస్ పార్టీపై ప్రభుత్వం దుర్మార్గాలకు పాల్పడితే ముమ్ముందు పెద్ద ఎత్తున ఉద్యమ తరహాలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/తొర్రూరు : మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచి తొర్రూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో యువకులు చిన్నారులు పలు ప్రాంతాల్లో తిరుగుతూ రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రంగులు పూసుకుని ఎంతో ఆనందంగా పండుగ జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకోగా ఊరూ వాడా వర్ణశోభితమైంది. ముఖ్యంగా వతీయువకులు సంబురాల్లో మునిగారు. దోస్తులతో కలిసి బైక్‌లపై తిరుగుతూ రంగులు పూసుకుంటూ సందడి చేశారు. కూడళ్ల వద్ద నృత్యాలతో హోరెత్తించారు. జీవితాల్లో ఆనందాన్ని నింపడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం కాగా పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రసాయన రంగులతో ఆడకుండా సహజ రంగులతో హోలీ జరుపుకున్నారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కృష్ణ కిషోర్, సీఐ గణేష్, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, మాజీ జెడ్పిటీసి మంగళపల్లి శ్రీనివాస్, టీఆర్ఎస్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, పీఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు మిరియాల సతీష్ రెడ్డి, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ రాజు, జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు హోలీ వేడుకల్లో రంగులు పూసుకుని ఆనందంగా గడిపారు.

కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కుటుంబ సభ్యులతో కలిసి హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. హోలీ పండుగలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా, అధికారులు, కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది, పలువురు పాత్రికేయులతో కలిసి హోలీ పండుగను జరుపుకున్నారు. పరస్పరం ఒకరినొకరు రంగులు పూసుకుంటూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు సిబ్బందికి మిఠాయిలు పంచారు. జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగను నిర్వహించుకోవాలని సూచించారు.

ఆరె కటికే సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్, పురపాలక సంఘ పట్టణంలో నీ విద్యానగర్ కాలనీలో ఉన్న సూర్యవంశం ఆరె కటికే సంఘ భవనంలో కటికే సంఘం సభ్యులు అందరూ కలిసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సుమారుగా 2000 ఓటర్లు కలిగిన సూర్యవంశ ఆరే కటిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అధ్యక్షులుగా ఆంకర్ రవికుమార్ అధ్యక్షులుగా బలేకర్ రంజిత్ ఉపాధ్యక్షులుగా గౌరీకర్ రాజు ప్రధాన కార్యదర్శిగా నాగు కోశాధికారిగా గుడికి సాయిరాంలను ఏకగ్రీవంగా, ఎన్నుకొని పూలమాలలతో శాలువాతో సత్కరించారు. సంఘ పెద్ద మనుషులు సత్కరించగా అధ్యక్షులు మాట్లాడుతూ హోర్నిశలు సంఘ శ్రేయస్సు అభివృద్ధి కొరకు పాటుపడతామని అన్నారు.

వ్యక్తి నిర్మాణం, దానధర్మాలకు ప్రాధాన్యత

సిపిఐ నేత సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: ముస్లింలు చాలా పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో అనేక విశిష్టతలు ఉన్నాయని అందులో ప్రధానమైనది వ్యక్తి సంస్కరణ, నిర్మాణమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. ఈ నెలలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిందన్నారు. ఇస్లాం మూలస్థానంలో ఒకటైన జకాత్ చాలా ముఖ్యమైన అంశం అన్నారు. సంపన్న వర్గాలు తమ సంపాదన నుంచి రెండున్నర శాతం జకాత సొమ్ము తీసి పేదలకు పంచి పెట్టాలని ఇస్లాం ఆదేశాలు ఉన్నాయన్నారు. శుక్రవారం కొత్తగూడెం రైల్వే కాలనీ మస్జిద్ ఏ బైతునూర్ నిర్వాహకులు, ఎండి అమీర్ ఖాద్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో సాబీర్ పాషా తోపాటు ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురేషి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఇస్లాం మూల స్తంభాల్లో ఇమాన్, (విశ్వాసం) నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర అనేవి ప్రతి ముస్లిం విధిగా నిర్వర్తించాల్సి ఉందన్నారు. వేసవిలో కనీసం నీళ్లు కూడా తాగకుండా సుమారు 13 గంటలకు పైగా ఈ కఠోర ఉపవాస దీక్ష ఉంటుందన్నారు. బలమైన సంకల్పం, ఆత్మవిశ్వాసం ఉంటే మనిషి దేన్నైనా సాధిస్తాడని చెప్పడానికి రంజాన్ ఉపవాసాలు సాక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, ఖాజాభాయ్, ఖిమత్భాయ్, ఖమర్ బాయ్, ఖాజా పాషా బాయ్, జాఫర్ భాయ్, జైలుద్దీన్ భాయ్, యూసుఫ్ బాబా, అహ్మద్ భాయ్, ఎండీ జమాల్, బాబుజని ఖాన్, సైద్ తాజుద్దీన్, ఫైజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాధాకృష్ణస్వామి కళ్యాణంలో ఎమ్మెల్యే కోరం పూజలు

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు మండలం కొమ్మగూడెం పంచాయతీ పరిధిలోని నాయకులగూడెం గ్రామంలో శుక్రవారం శ్రీ రాధాకృష్ణ స్వామి కళ్యాణ మహోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యులు కోరం కనకయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలకు ఆత్మీయంగా సన్మానించారు. నియోజకవర్గ ప్రజలందరికీ స్వామివారు ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే కోరారు. ధర్మం అనేది ప్రజల మధ్య శాంతి సౌభాగ్యాలు కలగాలని సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మాజీ ఎంపిటిసి పుణెం సురేందర్, తాటి యశోద, కాకాటి భార్గవ్, డి శివ, పాయం నవీన్, తాటి రాంబాబు, నాగార్జున, మూతి కృష్ణ, గుగ్గల లక్ష్మయ్య, చీమల వెంకన్న, గ్రామ పెద్దలు పాయం రామచంద్రం, చాపల పద్మ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్‌ను కలిసిన విద్యా సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఇటీవల కొత్తగా నియామకమైన సింగరేణి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కే.వెంకటేశ్వర్లు కొత్తగూడెంలోని తన చాంబర్‌కు వచ్చారు. శుక్రవారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్‌తోపాటు జాయింట్ సెక్రటరీ కె.సునీల్ కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చింతా శారద, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యా రాణి, పాఠశాల హెచ్‌ఎం సాయి సుజాతలు డైరెక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొద్దిసేపు సింగరేణి విద్యా సంబంధిత స్థితిగతులపై గుండా శ్రీనివాస్‌ను డైరెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

పచ్చ జొన్నలతో ఆరోగ్యానికి మేలు : భోజ్యా నాయక్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రైతులు సాంప్రదాయ పంటలు వదిలేసి అన్ని వాణిజ్య పంటలపైనే దృష్టి పెట్టడం వల్ల అనేక కష్టాలు చవిచూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాలోత్ భోజ్యా నాయక్ అన్నారు. సాంప్రదాయ, సహజ పంటలు రైతులకు ఆరోగ్యంతో పాటు వర్తమాన పరిస్థితుల్లో కొంత ఆర్థికంగా కూడా గ్యారంటీ ఇస్తాయన్నారు. శుక్రవారం ఆయన తన చేలో పండించిన పచ్చజొన్న పంటలు ఈ సందర్భంగా మీడియాకు ప్రదర్శించారు. ఈ జొన్నలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తున్నట్లు చెప్పారు. నేటి ఆధునిక జీవితాల్లో పురుగుమందులు అధికంగా వాడే ఆహారాలు తింటూ బీపీ, క్యాన్సర్, కిడ్నీ, షుగర్లతో పాటు అనేక వ్యాధులతో బాధపడుతున్న పరిస్థితులను భోజ్యా వెల్లడించారు. పొద్దున్నే జొన్న జావా, సాయంకాలం జొన్న రొట్టెలు తిన్నవాళ్లు పల్లెల్లో ఇప్పటికి చాలా ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కూడా సహజ, అంతర్గత పంటలు, భూముల్లో పంటల మార్పిడిపై దృష్టి సరించి రైతులు విస్తృతంగా మేల్కొల్పుతున్నారని ఈ సందర్భంగా భోజ్యా ప్రస్తావించారు. కాబట్టి రైతులు తింటానికైనా అరఎకరం వరకైనా పచ్చ జొన్న లాంటి సాంప్రదాయ పంటలు వేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. వీటికి మార్కెట్లో మంచి ధర కూడా ఉందని తెలిపారు.

సంపాదకీయం

నియోజకవర్గాల పునర్విభజన సంక్షోభ ఘంటికలు

శాసనసభల, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగడానికి చాలా సమయం ఉంది. కానీ దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో సఫలమైనందువల్ల ఇక్కడి రాష్ట్రాలలో లోక్‌సభ సీట్లు తగ్గిపోతాయన్న ప్రమాదం పొంచి ఉంది. దీనికి వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గట్టిగా గొంతెత్తుతున్నారు. హిందీని రుద్దాలని కేంద్ర ప్రభుత్వం కుటిల యత్నాలు చేస్తున్నందువల్ల ఈ ప్రయత్నాలను మొదటి నుంచి తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. హిందీని రుద్దడానికి వ్యతిరేకంగా స్టాలిన్ తీవ్ర వైఖరి అనుసరించడం వెనక వచ్చే శాసనసభ ఎన్నికల మీద దృష్టి కూడా కారణం అయి ఉండొచ్చు. కానీ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలుగుతుందన్న భయం అనేక మందికి ఉంది. ఉత్తరాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ మీద ఎప్పుడూ ఎక్కువ దృష్టి పెట్టలేదు. అందువల్ల పునర్విభజన తరవాత అక్కడ లోక్‌సభ సీట్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. స్టాలిన్ దాదాపు పునర్విభజన, హిందీని రుద్దడంపై యుద్ధమే ప్రకటించారు. ఆయన రూపాయి చిహ్నాన్ని కూడా మార్చేశారు. నిజానికి మనం ఇప్పుడు ఉపయోగిస్తున్న రూపాయి చిహ్నాన్ని రూపొందించింది తమిళనాడుకు చెందిన వ్యక్తే. కానీ ఆ చిహ్నాన్ని స్టాలిన్ ప్రభుత్వం మార్చినందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేవణాలు తీస్తున్నారు. ఈ చిహ్నాన్ని రూపొందించినప్పుడు స్టాలిన్ ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ఆమె ప్రశ్నిస్తున్నారు. కాని స్టాలిన్ ఇప్పుడు వినియోగించిన తమిళ భాషలో ఉన్న రూపాయి చిహ్నాన్ని నిర్మలా సీతారామన్ గతంలో అనేక సార్లు ఉపయోగించారు. ఇప్పుడు ఆమె అభ్యంతరం చెప్పడంలో ఆంతర్యం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పునర్విభజన అంశాన్ని చర్చించడానికి స్టాలిన్ ఇదివరకే తమిళనాడులో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మరో సమావేశం కూడా ఏర్పాటు చేయబోతున్నారు. అభివృద్ధి సాధించడం, జనాభాను నియంత్రించడం దక్షిణాది రాష్ట్రాలు చేసిన పాపం అయిపోయిందని స్టాలిన్ వాదిస్తున్నారు. నిజంగా జనాభా నియంత్రణ ఫలితాలను దృష్టిలో ఉంచుకోకుండా కేవలం జనసంఖ్య ఆధారంగా మాత్రమే పునర్విభజన జరిగితే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గడం వాస్తవం. మరో 30 ఏళ్ల పాటు నియోజకవర్గాల పునర్విభజనను వాయిదా వేయాలని స్టాలిన్ కోరుతున్నారు. హడావుడిగా దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను పట్టించుకోకుండా పునర్విభజన కొనసాగితే దేశ ఐక్యతకే ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుంది. నియోజక వర్గాల పునర్విభజన అంటే కేవలం జనాభా ప్రాతిపదికగా నియోజకవర్గాల సంఖ్య పెరగడమో, తగ్గడమో మాత్రమే కాదు. నియోజకవర్గాల సంఖ్య మార్చకుండానే నియోజకవర్గాల పరిధులు మారిన ఉదంతాలు ఉన్నాయి. ఇది రెండో రకం పునర్విభజన. దీనివల్ల ఏ రాష్ట్రానికీ ప్రమాదం ఉండదు కానీ నియోజకవర్గాల సంఖ్య మారితే అనుమానిస్తున్న ప్రమాదం ముంచుకు రాక తప్పదు. కేవలం పరిధులు మాత్రమే మార్చినందు వల్ల ప్రస్తుతం ఒక నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రాంతాలు మరో నియోజకవర్గ పరిధిలో చేరిపోవచ్చు. కానీ నియోజకవర్గాల సంఖ్యను మారిస్తే శాసనసభా నియోజకవర్గాల సంఖ్యకు సంబంధించి పెద్ద నష్టం ఉండకపోవచ్చు. అయితే లోక్‌సభలోని స్థానాలను దృష్టిలో ఉంచుకుంటే ప్రభావం కచ్చితంగా ఉంటుంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు సేకరించాలి. ఆ జనాభా ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య కూడా మారొచ్చు. 1950లో మొట్టమొదటి సారి లోక్‌సభ నియోజకవర్గాల విభజన జరిగింది. దానీ ఆధారంగానే 1952 ఎన్నికలు జరిగాయి. ఆ తరవాత 1961లో 1971లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తరవాత నియోజకవర్గాల పునర్విభజనను 1976లో పాతికేళ్లు వాయిదా వేశారు. 2001లో వాజపేయి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మళ్లీ ఈ విషయం చర్చకు వచ్చింది. అప్పుడూ వాయిదా పడింది. దేశంలో అనేక వైరుధ్యాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన మరో వైపరీత్యంగా పరిణమించకూడదు. దేశ సమైక్యత బలవంతాన సాధించే అంశం కాదు. పరస్పర అవగాహన, సర్దుబాటు ధోరణి కొనసాగితేనే దేశం సమైక్యంగా ఉంటుంది. ఉదాహరణకు 1965-66లోనూ తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం తీవ్ర స్థాయిలోనే వ్యక్తం అయింది. కానీ ఆ రోజుల్లో లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వం ఈ విషయంలో ఒక అడుగు వెనక్కు వేసింది. దీనివల్ల పెద్ద ప్రమాదం తప్పింది. ఇప్పుడు కూడా నియోజకవర్గాల పునర్విభజన, లేదా త్రిభాషా సూత్రం అమలు విషయంలోనూ సంయమనం పాటించవలసిన అవసరం ఉంది. పంజాబ్‌లో తీవ్రవాదం తలెత్తినప్పుడు, ఈశాన్య రాష్ట్రాలలో వేర్పాటువాద ఛాయలు కనిపించినప్పుడూ కేంద్ర ప్రభుత్వం సంయమనం పాటించి ముప్పు తప్పించింది.

ఇప్పటికే దేశంలో మూడు రకాల విభేదాలు కనిపిస్తున్నాయి. ఒకటి: హిందీ అనుకూల ప్రాంతాలు, హిందీ వ్యతిరేక ప్రాంతాలు. రెండు: అభివృద్ధిలో అసమానతలు. దక్షిణాది రాష్ట్రాలు గణనీయంగా అభివృద్ధి సాధించగలిగాయి. ఉత్తరాదిలో ఈ పరిస్థితి కనిపించదు. మూడవది: బీజేపీ ప్రభావం ఉన్న రాష్ట్రాలు, బీజేపీ ప్రభావం అంతగా లేని రాష్ట్రాలు. ఈ మూడు విభేదాలు సమసిపోకుండానే నియోజకవర్గాల పునర్విభజన మరో రకమైన విభేదాలకు దారి తీయకూడదు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనను పట్టించుకోకుండా పునర్విభజన కొనసాగిస్తే లాభమంతా ఉత్తరాది రాష్ట్రాలకు దక్కితే మొత్తం నష్టాన్ని దక్షిణాది రాష్ట్రాలు భరించవలసి వస్తుంది. అభ్యంతరాలను పట్టించుకోకుండా పునర్విభజన జరిగితే హిందీ మాట్లాడే ప్రాంతాలలోనే లోక్‌సభ సీట్లు పెరుగుతాయి. ఈ ప్రాంతాలలోనే బీజేపీకి గట్టి పట్టు ఉంది. నియోజకవర్గాల సంఖ్య తగ్గుతుందన్న భయం ఉన్న దక్షిణాది రాష్ట్రాలలో ఒక్క కర్నాటకలో తప్ప ఇప్పటిదాకా బీజేపీ అధికారంలోకి రాలేకపోయింది. అందువల్ల పునర్విభజన కేవలం బీజేపీకి అనుకూలంగా పరిణమిస్తుందన్న భయాందోళనలు సహజమైనవే. హిందీ మాట్లాడే రాష్ట్రాలలో ప్రస్తుతం 226 సీట్లు ఉన్నాయి. ఇప్పుడనుకున్న పద్ధతిలోనే హిందీ రాష్ట్రాలలోనే 259 సీట్లు ఉంటాయి. బొంబాయి లాంటి ప్రాంతాలలో హిందీ మాట్లాడే వారిని కూడా లెక్కవేస్తే ఈ సీట్ల సంఖ్య మరింత పెరుగుతుంది. బీజేపీ బలమూ పెంచుకోగలుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలు సంపద సృష్టించడంలో ముందున్నాయి కనక ఈ రాష్ట్రాలు చెల్లించే పన్నుల మొత్తం కూడా ఎక్కువ. కానీ తమకు కేంద్రం నుంచి అందే నిధులు ఆ నిష్పత్తిలో లేవన్న అసమ్మతి స్వరాలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. ఇలాంటి అంశాల మీద అసమ్మతి ఇప్పుడు మంద్ర స్థాయిలో ఉండొచ్చు. కానీ పునర్విభజనవల్ల కలిగే నష్టం కూడా జతకూడితే ఈ అసమ్మతి ప్రతిఘటనకు, ఆందోళనకు, ఉద్యమాలకు దారి తీస్తుందని చాలా మంది గుర్తించడం లేదు. మా రాష్ట్ర జనాభా ఎక్కువ కనక మాకు ఎక్కువ లోక్‌సభ స్థానాలు దక్కాలి, మేం ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లిస్తున్నాం కనక కేంద్రం కేటాయింపుల్లో కూడా అధిక స్థానం దక్కాలి అన్న వాదనలు పైకి చూడడానికి సబబుగానే కనిపించవచ్చు. కానీ ఈ వాదనలు అత్యంత ప్రమాదకరమైనవి.

గరిమెళ్ల... ఓ చూపున్న పాట

"అదివో అల్లదివో శ్రీహరి వాసము" అంటూ పాట వినిపించి ఎవరికీ చెప్పాపెట్టకుండా ఆ హరివాసం దగ్గరికి వెళ్లిపోయారు మన ముందే నడిచిన ఈ కాలపు అన్నమయ్య గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్. "అఖిల మునులకు నిత్య నివాసం" అక్కడుంది కదా... ఈ మునిని కూడా వచ్చేయమని అన్నమయ్య చేత కబురంపాడేమో మనకు తెలియనివాడు... అందుకేనేమో ఎలా వచ్చారో అలాగే వెళ్లిపోయారు గరిమెళ్ల వారు. కాకపోతే పదుల సంఖ్యలో అన్నమయ్య కీర్తనలకు ఓ చూపు ఇచ్చి "ఇవి వింటూండండి. ఇలా వెళ్లి అలా చటుక్కున వచ్చేస్తాను. మరో పేరుతో" అని ఏనిమిదో కొండ ఎక్కేశారు. మనమంతా ఏడుకొండల వాడా అంటాం కదా... నిజానికి మనం ఎక్కడానికే ఏడు కొండలు... ఆ కలియుగ దైవం ఉండేది ఎనిమిదో కొండ అనీ, అక్కడికి మనం నడుచుకుంటూ వెళ్లలేమనీ భక్తుల నమ్మకం. అలాగని మరణానంతరం అక్కడికే వెళ్తామన్న నమ్మకమూ ఉండదు. ఇదిగో ఇలా గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ వంటి మహానుభావులకే అలాంటి అపురూపమైన అవకాశం ఇస్తాడని వారి అభిప్రాయం.

"బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే" అని ఆ అన్నమయ్య అన్నారు కానీ ఆ పరబ్రహ్మం ఎలా ఉంటుందో తెలుగు వారి కళ్లకి తన గాత్రంతో చూపించింది ఈ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాదే. పూజ అంటే గుళ్లు కట్టడం, అందుకోసం చందాలు వసూలు చేయడం అనుకున్న వారికి "దేవగాత్రంతో ఆరాధించడమే దైవారాధనరా" అని ఆ గ్రామ్‌ఫోన్‌లో చెప్పారు. తర్వాత తర్వాత క్యాసెట్లు, సీడీలు, డీవీడీలు వచ్చాయనుకోండి. నాస్తికత్వం కాదు కానీ ఆరాధకుడు రాజకీయ ముడిసరుకుగా మారిన తర్వాత గుళ్లు, గోపురాలపై అనుమానపు చూపులు గుచ్చుకుంటుంటే, ఈ చూపులను దారి మళ్లించి "పుట్టువు నీవే పురుషోత్తమా... నట్ట నడుము నీవే నారాయణ" అని తెలతెలవారుతూండగా గరిమెళ్ల వారి గొంతులోంచి వినిపిస్తూంటే చెప్పొద్దూ... 'గుడులకు, అక్కడిచ్చే తీర్థ ప్రసాదాలకు దూరంగా ఉందాం. ఈ గరిమెళ్ల వారి గాత్రంలోనే ఆ కలియుగ దైవాన్ని చూసేద్దాం' అనుకున్నా చాలాసార్లు.

ఆరాధకుడి శృంగారాన్ని అన్నమయ్య రాయడమైతే రాశారు కానీ ఈ గరిమెళ్ల వారు "జల్లన బుప్పొడి జారగా బతిపై/ చల్లే రతివలు జాజర"... "భారపు కుచముల పైపైగదు సిం/ గారము నెరెపెడి గంధవొడి" అని పాడుతూంటే ఆ గాత్రానికి దక్కిన అదృష్టానికి కుళ్లుకోవాల్సిందే. ఇప్పటి మాట కాదు... నాలుగున్నర దశాబ్దాల క్రితం మాటలెండి. అంటే 1978వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్నమయ్య ప్రాజెక్ట్ పెట్టారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అన్నమయ్య సంకీర్తనలకు ప్రాచుర్యం కలిగించాలని ఆనాటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీ.వీ.ఆర్.కె. ప్రసాద్ ఉద్దేశ్యం. ఇందుకోసం కొందరు గాయకులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వాలనుకున్నారు. ఆ

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

ఇంటర్వ్యూకి ఓ పాతికేళ్ల లోపు కుర్రాడు వచ్చాడు. ఆయనతో పాటు పారుపల్లి రంగనాథ్, శోభారాజ్ కూడా వచ్చారనుకోండి. ఈ కుర్రాడు అప్పటికే ప్రభుత్వ కార్యాలయంలో టైపిస్ట్. జీతం 250 రూపాయలు. ఇంటర్వ్యూ చేస్తున్న వారు మహా విద్వాంసులు నేదునూరి వారు, మంగళంపల్లి , పసుపతి అన్నమాట. ఈ పిల్లాడ్ని "నీకు ఇక్కడ వంద రూపాయలే ఇస్తాం. నూటయాభై రూపాయలు పోతుంది. చేరతావా!" అని అడిగారట. "చేరతానండి. నాకు అన్నమయ్య కీర్తనలు నేర్చుకోవాలనుంది" అన్నాడా కుర్రాడు. అక్కడ సంకీర్తనలు సాధన చేసిన తర్వాత ఇదిగో ఈ అన్నమయ్య నిజ వారసుడు గరిమెళ్ల బాల కృష్ణ ప్రసాద్‌గా పేరొందారు. కుర్రాడికి జీతం తక్కువ... అద్దెలు గట్రా కష్టం అని భావించిన నేదునూరి కృష్ణమూర్తిగారే కొండ మీద ఉన్న తిరుమల మ్యూజియంలో బస ఇచ్చేలా చేశారట. అక్కడ తల్లితో కలిసి ఉంటూ అన్నమయ్య కీర్తనలు సాధన చేసే వారు గరిమెళ్ల వారు. ఇదంతా ఎందుకంటే నీకు ఆసక్తి ఉంటే సరస్వతమ్మ ఇలా కరుణిస్తుందని చెప్పడానికే.

తెలుగు లోగిళ్ల నుంచి ప్రతి ఇంట్లో విష్ణు సహస్రనామం, భజ గోవిందం వినిపించి మనల్ని కొత్త రోజులోకి ఆహ్వానిస్తారు కదా మహా గాయని ఎం.ఎస్.సుబ్బలక్ష్మి ... ఆ తల్లి కష్టాల్లో ఉందని తెలుసుకున్న కంచి పీఠాధిపతులు ఆ గాయనీమణికి సాయం చేయమని పీ.వీ.ఆర్.కె. ప్రసాద్‌ని ఆదేశించారట. ఊరికే సాయం చేస్తే ఆ మహా గాయని అంగీకరించరని భావించిన పీ.వీ.ఆర్.కె. ప్రసాద్ గారు ఈ గరిమెళ్ల, శోభారాజ్‌తో... "అన్నమయ్య కీర్తనలు సుబ్బలక్ష్మి గారి నోట పలికించండి" అని చెప్పారట. వాళ్లిద్దరూ అదే పని చేశారు. అంతటి మహా గాయనికి అన్నమయ్య సంకీర్తనలు అందించింది ఈ గరిమెళ్లే కావడం ఆయన కీర్తనలు విని తరించే వారి అదృష్టం.

మరో విషయం... అదే గరిమెళ్ల వారి గొప్పతనం ఏమిటంటే కొత్తగా ఓ పదకొండు కీర్తనలు స్వరపరిచి ఆ రాగాల్లో అన్నమయ్య కీర్తనలు పాడింది అచ్చంగా గరిమెళ్ళ బాల కృష్ణ ప్రసాద్ గారే అని తెలిసి, అన్నమయ్య అన్నట్లు "ఇది కాదు తపము.. ఇది కాదు జన్మమూ" అనుకోకుండా ఉండలేకపోయాను. అంతకు ముందు అన్నమయ్య కీర్తనలు వినాలంటే మా ఊరాయన మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి గాత్రం నుంచే వినాలనుకునే వారు చాలా మంది అభిమానులు. కానీ గరిమెళ్ళ వారు ఆ కీర్తనలు ఆలపించిన తర్వాత స్వయంగా మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారే "అంత భక్తి పారవశ్యంతో గరిమెళ్ళ వారు అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూంటే ఇక నేనెందుకు మళ్లీ పాడడం" అన్నారని ఆ సభలో ఉన్నాయన నాతో అన్నారు. ఇదీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారంటే.

- సీనియర్ జర్నలిస్ట్, 9912019929.

అంతర్జాతీయ మితవాద శక్తుల ఏకం

డి. రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి వ్యవస్థకు అత్యున్నత స్థితి అని, పెట్టుబడిదారి వ్యవస్థ క్షీణ దశ ఫలితంగా అది ఆవిర్భవిస్తుందని, శతాబ్దికి ముందే వ్లాదిమిర్ ఇల్యూచ్ లెనిన్ చెప్పారు. ఆయన విశ్లేషణ కాలపరీక్షలో నిలబడింది. అంతర్జాతీయంగా జీవితాలను మెరుగుపరచటంలో విఫలమైనప్పుడు, సంక్షుభిత పెట్టుబడిదారి వ్యవస్థ తనని తాను బతికించుకునేందుకు మానవాళికి ఏమైనప్పటికీ ఎలాంటి చర్యలకైనా తెగిస్తుంది. 2000 సంవత్సరం అనంతరం కాలంలో ఆర్థిక పతనం తదుపరి అతలాకుతలమైన కాలంలో మితవాద, పచ్చి మితవాద రాజకీయ శక్తులు ఏకమయ్యాయి. ఇది పెట్టుబడిదారి వ్యవస్థ నిర్ణీత కాలంలో వైఫల్యాలు ఎదుర్కొన్నప్పుడు సంభవించే పరిణామం. ఆ సమయంలో నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రజాగ్రహాన్ని పక్కదోవ పట్టించేందుకు చట్టాలను నిందిస్తూ, వలసదారులను, మైనారిటీలను బలిపశువులను చేసేందుకు అంతర్జాతీయ మితవాదం ప్రయత్నిస్తుంటుంది. ఈ పరిస్థితులను ఎదుర్కొనడంలో సైద్ధాంతికంగా విఫలమైన నయా ఉదారవాద వ్యవస్థ, మితవాదం నుంచి మధ్యేవాదం మధ్య ఊగిసలాడసాగింది. మితవాద వృద్ధికి అడ్డుకట్టవేసేందుకు విశాల కూటమి ఏర్పాటులో విఫలమవడంతో అమానవీయ పెట్టుబడిదారి వ్యవస్థ జీవించగలిగింది. తన సామ్రాజ్యవాద రూపంలో కార్మిక హక్కులపై, సామాజిక భద్రత, సమాజంలో సాధారణ సామరస్యంపై మితవాద దాడులు సాగాయి. మన కాలంలో, పరిస్థితి మరింత ఘోరంగా మారి భౌగోళిక మితవాద కూటమి ఆవిర్భవించేందుకు సంకేతాలు కనపడుతున్నాయి. ఆ కూటమి మరింత దూకుడుగా ప్రజాస్వామిక నియమాలను తుంగలో తొక్కుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తాజా అమెరికా పర్యటనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏకీకరణకు సంబంధించి కొన్ని సూచనప్రాయమైన సంకేతాలిచ్చారు. ట్రంప్‌తో ప్రధాని మోదీ సమావేశం భారతదేశానికి దేశీయంగా, అంతర్జాతీయంగా రెండు రకాల ఫలితాలను ఇచ్చాయి. అంతర్జాతీయ స్థాయిలో మితవాద శక్తుల ఏకీకరణ ప్రభావాల జోలికి వెళ్లకుండానే తొలుత ఆయన పర్యటనలో ఏది ప్రధానమో ఒకసారి చూద్దాం. ఈ పర్యటనలో వెలుగు జిలుగుల సంయుక్త ప్రకటనలు, ఉత్సాహపూరిత కార్యక్రమాల నడుమ మోదీ, ట్రంప్ మధ్య సహృద్భావత ఘనంగా ప్రదర్శితమైంది. అంతర్జాతీయ, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో దోపిడీ స్వభావ అంశాలు అలాగే మిగిలి ఉన్నాయి. భారతదేశంపై అన్యాయంగా విధించిన టారిఫ్‌లు, భారతీయ అక్రమ వలసదారుల పట్ల అమానవీయ వ్యవహారం ఆందోళన కలిగించే అంశాలపై ట్రంప్‌తో తలపడేందుకు మోదీ అయిష్టత వ్యక్తం చేశారు. ఇది భారత సార్వభౌమత్వాన్ని, ప్రజల హక్కులను నిలబెట్టడంలో ఆయన అధికార యంత్రాంగ విస్తృత వైఫల్యాన్ని ప్రతిబింబించింది. వాణిజ్యం విషయంలో దూకుడు వైఖరి, బ్రిక్స్ వంటి బహుళపక్ష వ్యవస్థలపై బెదిరింపులు ట్రంప్ భారీ సామ్రాజ్యవాద ఎజెండాను బట్టబయలు చేస్తున్నాయి. అమెరికా ఆధిపత్యాన్ని దృఢపరిచేలా అవి సాగుతున్నాయి.

మోదీ, స్వదేశంలో ఆయన మద్దతుదారులు ఈ పర్యటనను గొప్ప విజయంగా ప్రచారం చేసుకోగా, ట్రంప్ సంరక్షణవాద విధానాలు, చివరకు భారత్‌కే నష్టం కలిగించే భిన్నమైన కథను చెబుతోంది. ఫోటో ఫోజులు దాటి చూసినట్లయితే, వాస్తవం పట్ల భారత ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కలిగి ఉంది. ట్రంప్ అధికార యంత్రాంగం భారతదేశానికి వ్యతిరేకంగా వరుస టారిఫ్‌లను, వాణిజ్యపరమైన పరిమితులను విధించేందుకు ప్రయత్నిస్తున్నది. భారతీయ ఎగుమతులు ప్రత్యేకించి ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్ భాగాల ఎగుమతులకు నష్టం జరుగుతోంది. ఇప్పటికే మోదీ ప్రభుత్వ దుర్నిర్వహణతో అతలాకుతలమవుతున్న తయారీ రంగం ట్రంప్ తాజా చర్యలతో అమెరికాలో తయారీ రంగం కేంద్రీకృతమై భారత్‌కు తీవ్ర హాని కలిగిస్తుంది. ట్రంప్ ఇలాంటి దూకుడు వాణిజ్య విధానాలను అవలంబిస్తున్నప్పటికీ మోదీ దృఢమైన వైఖరి తీసుకోక పోవటం లేదా బహిరంగంగా సమస్యలను ప్రస్తావించకుండా తమాయించుకున్నారు. ఇది కేవలం దౌత్యాన్ని చేతుల కలపడం (హ్యాండ్ షేక్), కౌగిలింతలకే పరిమితం చేసిన ఫలితం. మోదీ పర్యటన తరువాత వార్తా శీర్షికలను మామూలుగా చూసినా కూడా ట్రంప్ పట్ల మన అధికార వర్గాల ఆందోళన బైటపడుతోంది. జి 20 ని రక్షించుకునేందుకే భారత్, చైనా సహకారం అని కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ జై శంకర్ అంగీకారం, లేదా బ్రిటన్, ఈయూలతో వాణిజ్య చర్చల పునరుద్ధరణ, ఇవన్నీ కూడా ఒకే కథను చెబుతున్నాయి. రష్యా ఉక్రెన్ యుద్ధంలో, ఘర్షణల్లో నాటో పాత్ర గురించి ప్రశ్నించకుండా ట్రంప్ తృతీయ ప్రపంచ యుద్ధం గురించి మాట్లాడుతూ ప్రపంచాన్నంతా వణికిస్తున్నారు.

మోదీ పర్యటన వైఫల్యాలలో భారత్‌కు వెనక్కి పంపిస్తున్న వలసదారుల పట్ల వ్యవహరించిన తీరుపై పూర్తి మౌనాన్ని ఆశ్రయించటం స్పష్టంగా కనిపిస్తుంది. ట్రంప్ అధికార యంత్రాంగం వలస విధానాలతో వందలాది భారతీయులు, అందులో అధికులు నైపుణ్యం కలిగిన కార్మికులు, శరణార్థుల పట్ల అవమానకర రీతిలో ప్రవర్తించింది. బందీలను అత్యంత అమానవీయ పరిస్థితుల్లో ఉంచారని, న్యాయ హక్కులను తిరస్కరిస్తున్నారని, వెనక్కి పంపిస్తున్న వారి చేతులకు సంకెళ్లు వేశారని వచ్చిన వార్తల నేపథ్యంలో ట్రంప్‌తో జరిగిన సమావేశంలో ఈ ఆందోళనలను లేవనెత్తకూడదని మోదీ నిర్ణయించుకున్నారు. దీంతో వారి పట్ల అమానవీయ ప్రవర్తన కొనసాగింది.

వాణిజ్య యుద్ధానికి, భారతీయుల పట్ల తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడకుండా, వాషింగ్టన్‌ను సంతుష్టిపరిచేందుకు మోదీ భారతీయుల ప్రయోజనాలను పణంగా పెట్టి కింద మీదపడుతూనే ప్రయత్నించారు. అంతర్జాతీయ మితవాద కూటమి బలి పీఠాన్ని ఎక్కించేందుకు, కొద్ది పాటి ఫోటోలు దిగేందుకు మోదీ దేశ ప్రయోజనాలను త్యాగం చేశారు.

అమెరికా పెత్తనానికి వ్యతిరేకంగా నిలబడేందుకు ఏర్పడిన బహుళపక్ష కూటమి బ్రిక్స్‌ను ధ్వంసం చేసేందుకు ట్రంప్ తన దూకుడు ఆర్థిక, విదేశాంగ విధానాల ద్వారా బలమైన ప్రయత్నాలు చేస్తుండడం ద్యోతకమవుతోంది. భూగోళంలో ఆవిర్భవిస్తున్న బహుళపక్షతకు సరైన వ్యక్తీకరణ, మరింత సమతుల్య భౌగోళిక ఆర్థిక విధానాన్ని సృష్టించేందుకు, పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు బ్రిక్స్ కూటమిని ఏర్పాటు చేశారు. ట్రంప్ అధికార యంత్రాంగం ఈ కూటమిని ఆర్థిక బెదిరింపులు, దౌత్య వ్యూహాలతో భయపెడుతున్నది. అదే సమయంలో బ్రిక్స్‌లో కీలక సభ్యుడైన ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉండిపోయారు. బ్రిక్స్ సభ్యులను ఏకాకులను చేసేందుకు బలవంతంగా వాణిజ్య ఒప్పందాలను రుద్దేందుకు, తమ ఆర్థిక పెత్తనాన్ని సవాలు చేసే దేశాలపై ఆంక్షలను విధించేందుకు, అమెరికా టారిఫ్‌లను ఆయుధంగా వినియోగిస్తుంది. అమెరికా పెత్తనంలో ఏకధృవ ప్రపంచం వైపు నెట్టేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. ఈ చర్యలను తిప్పికొట్టేందుకు మోదీ అయిష్టత వ్యక్తం చేస్తూ భారత సార్వభౌమత్వాన్ని , దీర్ఘ కాలిక ఆర్థిక ప్రయోజనాలను పణంగా పెడుతున్నాడు. ఇది కేవలం బ్రిక్స్‌కే కాకుండా 'మియా' లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అంగీకరించినట్లుగా, భారీ ప్రచారంతో భారత్ ఆతిథ్యం ఇచ్చిన జి 20 వంటి కూటముల నిబద్ధత ప్రమాదంలో ఉన్నాయి.

మోదీ, ట్రంప్ చర్చలు దౌత్య కసరత్తులో భాగంగా జరుగుతున్నట్లుగా అనిపించినప్పటికీ, అవి అంతర్జాతీయ మితవాద శక్తుల ఏకీకరణను వృద్ధి చేసే సంకేతాలిచ్చాయి. నూతన సహకార సాంప్రదాయవాద ఉద్యమం" అంతర్జాతీయంగా ఆవిర్భవిస్తోందని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలై, ఆమె(మెలోనీ), భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కూటమికి అంతర్జాతీయ ప్రతినిధులు అని ఆమె పేర్కొన్నారు. ఈ కూటమి పెట్టుబడికి సంరక్షణవాదం, కార్మిక హక్కుల అణచివేత, వలసలు, మైనారిటీల పట్ల ఏహ్యాభావన వంటి ఉమ్మడి దృక్పథాన్ని పంచుకుంటున్నది. పెట్టుబడి స్వేచ్ఛాగమనం కోసం కాంక్షించే ఈ మితవాద శక్తులు కార్మికుల కదలికకు దూకుడుగా అడ్డుకట్ట వేస్తున్నాయి. ట్రంప్ వలస వ్యతిరేక విధానాలు, భారతీయ ప్రొఫెషనల్స్‌ను ప్రభావితం చేస్తున్న వీసా ఆంక్షలు విషయంలో మోదీ మౌనం, కార్పొరేట్ లాభాలను పెంచటం, కార్మికుల పట్ల వ్యతిరేకంగా ఉండడం అనే భావన ఇద్దరిలో కనపడుతోంది. కార్మిక వర్గ సంక్షేమం కంటే బడా వ్యాపారాల ప్రయోజనాలే ప్రాధాన్యంగా ఉండే మితవాద ఆర్థిక నమూనా భౌగోళిక ఆర్థిక అసమానతలను తీవ్రం చేస్తున్నది. ఈ మితవాద కూటమి బలోపేతమవటం కొనసాగినట్ల యితే, పర్యవసనాలు అంతర్జాతీయంగా కార్మిక వర్గం, వలసదారులు, వాతావరణ న్యాయ ఉద్యమాలపై వినాశకరంగా ఉంటాయి. అది కార్మికుల గమనంపై ఆంక్షలు విధిస్తూ , కార్పొరేట్ విస్తరణను ప్రోత్సహిస్తూ , కొన్ని ప్రాంతాలలో పేదరికాన్ని మరింత పెంచడమే కాకుండా కొద్ది మంది చేతుల్లోకే సంపద వెళ్లిపోయేలా చేస్తుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా దక్షిణ భూగోళంలో కార్మికులు ఉద్యోగ అవకాశాలు కుంచించుకుపోవటం, ఆర్థిక అంశాల వంటి సమస్యలు ఎదుర్కొంటూ నిరంతరం బలిపశువులు అవుతుంటారు. అంతర్జాతీయ వాతావరణ ఒప్పందాల నుంచి ట్రంప్ వైదొలగడం, కార్పొరేట్ అనుకూల వాతావరణ విధానాలపై మోదీ దృష్టి పెట్టడం వంటివి సుస్థిర అభివృద్ధి మీద బడా వ్యాపారుల ప్రయోజనాలే పైచేయిగా సూచిస్తుంటాయి. సామ్రాజ్యవాద ప్రయోజనాలకోసం అత్యవసరాలు ఉన్న ప్రజల కంటే కూడా ఖజానా నుంచి సైనిక పారిశ్రామిక సముదాయానికి నిధులు మళ్లిస్తారు. అంతర్జాతీయ విధానాలు ఇదే మార్గంలో కొనసాగినట్లయితే, భవిష్యత్తులో మొత్తంగా మెజారిటీ ప్రజల జీవన ప్రమాణాలు క్షీణిస్తాయి. అత్యంత పేద దేశంలో, సంపన్న దేశాల్లో పేదలపై అసమానంగా ప్రభావం చూపే వాతావరణ పెరిగిపోతుంది.

ఇలాంటి క్రూర మితవాద ఎజెండాను ప్రతిఘటించేందుకు, దోపిడీతత్వ పెట్టుబడిదారివాదం, అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదాలను సవాలు చేసే ప్రజానుకూల ప్రత్యామ్నాయం వైపు ప్రపంచం చూడాలి. దక్షిణ భూగోళంలోని దేశాల మధ్య సహకారం పెంపొంది, కార్మికుల కేంద్రంగా ఉండే విధానాలపై పెట్టుబడి పెరిగి, స్థానిక అభివృద్ధిని పణంగా పెట్టి, పాశ్చాత్య ఆర్థిక ప్రయోజనాల కోసం పనిచేసే నయా ఉదారవాద యంత్రాంగాన్ని తిరస్కరించాలి. బ్రిక్స్, అలీనోద్యమం , అమెరికా ప్రభావంలేని ప్రాంతీయ వాణిజ్య ఒప్పందం వంటి వాటిని పునరుత్తేజ దృష్టితో బలోపేతం చేసుకోవాలి. న్యాయమైన కార్మిక విధానాలు, పర్యావరణ రక్షణ, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక న్యాయం కోసం భౌగోళిక ఒప్పందాలను పునర్వ్యవస్థీకరించాలి. మితవాద ఆధిపత్యవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం, కేవలం ఆర్థిక యుద్ధమే కాదు ఇది గౌరవం, న్యాయం, మానవ హక్కుల కోసం జరిగే పోరాటం. ప్రమాదకరమైన ఉప్పెనకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రగతిశీలశక్తులు తప్పక ఏకమై, కార్మికుల అభ్యున్నతి, మైనారిటీల రక్షణ, సుస్థిర ఆర్థిక అభివృద్ధి విధానాల కోసం పాటుపడాలి. అంతర్జాతీయ మితవాద శక్తులు ఉధృతంగా అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలను తిరస్కరించడం ద్వారానే భవిష్యత్తు తరాలకు మరింత న్యాయమైన, సమానత్వ ప్రపంచ నిర్మాణం కోసం మనం ఆకాంక్షించవచ్చు.

పార్లమెంటులో సీపీఐ ప్రజానుకూల వైఖరి

ఆర్వీ రామారావ్

పార్లమెంటరీ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే వామపక్ష పార్టీలకు, ముఖ్యంగా సీపీఐకి 1967లో నాల్గవ లోకసభ ఎన్నికల నుంచి 2004లో అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం పడిపోయే దాకా స్వర్ణ యుగమేనని చెప్పాలి. 1967 నుంచి 2004 దాకా ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు కలిపి లోక్‌సభలో దాదాపు 50 సీట్లు ఉండేవి. 1962లో మూడవ లోక్‌సభ ఎన్నికలలో సీపీఐ సాధించిన స్థానాలు ఇంతవరకు అత్యధికంగా 29 సీట్లు. పార్టీ చీలిపోయిన తరవాత 1964లో కూడా సీపీఐ 23 సీట్లు సంపాదించింది. సీపీఎంకు అప్పుడు 19 స్థానాలు దక్కాయి.

కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంటరీ రాజకీయాలకే పరిమితం కావడం సరైన పంథానేనా కాదా అన్న విషయంలో ఎంతైనా చర్చించవచ్చు. కానీ పార్లమెంటరీ రాజకీయాలు అనుసరించడం మొదలు పెట్టిన తరవాత సీపీఐ రెండు విధాలుగా అత్యంత ప్రభావం చూపింది. మొట్టమొదటిది హిరేన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తా, భూపేశ్ గుప్తా, రేణూ చక్రవర్తి లాంటి ఉత్తమ పార్లమెంటేరియన్లను సీపీఐ సమకూర్చింది. ఉత్తమ పార్లమెంటేరియన్లు అయిన వారికి అవార్డు ఇవ్వాలని

నిర్ణయించినప్పుడు ఆ అవార్డు మొట్ట మొదట దక్కింది సీపీఐ నాయకుడు ఇంద్రజిత్ గుప్తాకే. రెండవది కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో, ముఖ్యంగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఆమె ప్రభుత్వం ప్రజానుకూల, ప్రగతిశీల విధానాలు అనుసరించడానికి సీపీఐ ఒత్తిడే ప్రధాన కారణం. ఇందిరా గాంధీ రాజాభరణాలు రద్దు చేయడం, బ్యాంకులను జాతీయం చేయడం వెనక సీపీఐ ఒత్తిడే ప్రధానంగా పని చేసింది. బొగ్గు గనులను జాతీయం చేయడంలో కూడా సీపీఐ ఒత్తిడి చాలా ప్రభావం చూపింది. మన్‌మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు యు.పి.ఎ. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టడంలో సీపీఐ పాత్ర విశిష్టమైంది. ఇతర వామపక్షాల సహకారమూ ఉంది. సమాచార హక్కు చట్టం కోసం అనితర సాధ్యమైన పోరాటం చేసిన అరుణారాయ్ ఒకప్పుడు సీపీఐలో క్రియాశీలంగా ఉన్నవారే. రైతుల రుణాల మాఫీ,



హిరేన్ ముఖర్జీ

రేణూచక్రవర్తి

భూపేశ్‌గుప్తా

ఇంద్రజిత్‌గుప్తా

గిరిజనులకు భూమి హక్కులు మొదలైనవి కూడా వామపక్షాలు సాధించిన విజయాలే.

2020 లో రైతులు దిల్లీ సరిహద్దుల్లో దాదాపు 15 నెలలపాటు బైఠాయిస్తే విధిలేక ప్రధానమంత్రి మోదీ మూడు వివాదాస్పదమైన సేద్య చట్టాలను వెనక్కు తీసుకోక తప్పలేదు. ఈ రైతుల ఉద్యమం రాజకీయాలకు అతీతంగా జరిగి ఉండొచ్చు. కానీ అందులో వివిధ రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న రైతు సంఘాల ప్రమేయం ఉంది. సీపీఐకి అనుకూలంగా ఉండే రైతు సంఘం కూడా ఈ సుదీర్ఘ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది.

సీపీఐ కార్యకలాపాలను కేవలం రాజకీయాలకు, పార్లమెంటులో సీట్లకు పరిమితమై చూడకూడదు. పార్లమెంటరీ రాజకీయాలు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో ఒక భాగం మాత్రమే. ఇతర రంగాలను, ముఖ్యంగా సాహిత్య, కళా రంగాలలో ప్రగతిశీల భావాలుగల వారిని సమీకరించడానికి సీపీఐ విశేషమైన కృషి చేసింది. మున్షీ ప్రేం చంద్ నుంచి మొదలుకుని, ముల్క్ రాజ్ ఆనంద్, కె.ఎ.అబ్బాస్, రాజేంద్ర సింగ్ బేడీ లాంటి వారు సీపీఐ అనుకూల విధానాలను అనుసరించే ప్రజా సంఘాలలో చాలా ప్రముఖంగా కనిపించే వారు. పృథ్వీరాజ్ కపూర్, రాహుల్ సాంకృత్యాయన్, సత్యజిత్ రే, ప్రసిద్ధ శాస్త్రవేత్త హోమీ జహంగీర్ భాభా వామపక్ష భావాలను అక్కున చేర్చుకున్న వారే.

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సోవియట్‌తో మైత్రి నెరపడంలోనూ సీపీఐ పాత్ర ఉంది. అయితే అంతమాత్రం చేత ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించడంలో వెనుకాడలేదు. 2004 ఎన్నికలలో ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ దక్కలేదు. ఆ దశలో మతతత్వ బీజేపీకి అధికారం దక్కకుండా చేయడానికి ఉభయ కమ్యూనిస్టు పార్టీలు యునైటెడ్ ప్రొగెసివ్ అలయన్స్ (యు.పి.ఎ.)కు మద్దతిచ్చాయి. మన్‌మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయ్యారు.

కేంద్రం మోసం చేసింది

- విద్యా నిధులు రూ.2 వేల కోట్లు ఎగవేత
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి తెన్నరసు
- మహిళల ఉచిత బస్సుకు రూ.3,600 కోట్లు
- రామేశ్వరంలో విమానాశ్రయం... చెన్నై సమీపంలో శాటిలైట్ సిటీ

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో 2025-26 బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇది వచ్చే ఏడాది రాష్ట్ర ఎన్నికలకు ముందు పూర్తిస్థాయి బడ్జెట్. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం సహా దాని ప్రధాన సంక్షేమ పథకాలకు భారీగా కేటాయింపులు చేసింది. త్రిభాషా విధానం, పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన వివాదాల నడుమ రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త రాజకీయ వాతావరణం మధ్య ఈ బడ్జెట్ వచ్చింది. కాగా కేంద్ర ప్రభుత్వం విద్యా నిధులు రూ.2 వేల కోట్లు ఎగవేసి తమిళనాడును మోసం చేసిందని ఆర్థిక మంత్రి తెన్నరసు ఆరోపించారు. ప్రభుత్వ రంగ మద్యం సంస్థ టాస్మాక్‌లో అవినీతి జరిగిందని, రూ.1,000 కోట్ల కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు జరిగాయని ఆరోపిస్తూ ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. టాస్మాక్ 'కుంభకోణం', 'టెండర్ రాజీనామా'కు నైతిక బాధ్యత వహించాలని తమ పార్టీ డీఎంకే ప్రభుత్వాన్ని కోరిందని, ఈ అంశంపై వాకౌట్ చేసిందని ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి కె.పళనిస్వామి విలేకరులతో అన్నారు. శాసనసభలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌ను సమర్పిస్తూ ఉచిత బస్సు సేవలను ఉపయోగించే మహిళల సంఖ్య 40 నుంచి 65 శాతానికి పెరిగిందని తెలిపారు. 'రాష్ట్ర రవాణా సంస్థలు నడుపుతున్న బస్సుల్లో రోజుకు సగటున 50 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. దీని ద్వారా ఇప్పటివరకు మొత్తం 642 కోట్ల ట్రిప్పులు జరిగాయి. ముఖ్యంగా, ఈ చొరవ కారణంగా మహిళలు నెలకు సగటున రూ.888 ఆదా చేస్తున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యయనం వెల్లడించింది. 2025-26 సంవత్సరానికి, బడ్జెట్ అంచనాలలో ఈ పథకానికి ప్రభుత్వం రూ.3,600 కోట్ల సబ్సిడీని కేటాయించింది' అని తెలిపారు. రామేశ్వరంలో కొత్త విమానాశ్రయాన్ని ఆర్థిక మంత్రి ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్‌లో కొత్త విమానాశ్రయాన్ని స్థాపించడానికి పనులు వేగవంతం చేసినట్లు చెప్పారు. రాష్ట్ర రాజధాని సమీపంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో ఒక శాటిలైట్ నగరం వస్తుందని ప్రకటించారు. మంత్రి బడ్జెట్ ప్రసంగం 2 గంటల 38 నిమిషాల పాటు కొనసాగింది. 1.15 కోట్ల మంది మహిళలకు నెలకు రూ.1,000 సహాయం అందించే 'కలైజ్ఞర్ మగలిర్ ఉరిమై తిట్టం' గురించి మంత్రి తెన్నరసు మాట్లాడుతూ రూ.13,807 కోట్లు కేటాయించామని, అర్హత ఉన్నప్పటికీ ఇంకా సహాయం అందని మహిళలు త్వరలో దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుందని ప్రకటించారు. రూ.77 కోట్లతో మరో 10 'తోజి' వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఆయన ప్రకటించారు. ఇప్పటికే 13 హాస్టళ్లు పనిచేస్తున్నాయి. ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని మరింత విస్తరించి, రూ.600 కోట్లు కేటాయించారు. ఇంకా 'సమగ్ర శిక్ష' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం గత ఏడు సంవత్సరాలుగా వివిధ విద్యార్థి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి వివరించారు. కలైంజ్ఞర్ కనవు ఇల్లం పథకం కింద లక్ష కొత్త ఇళ్లకు రూ.3,500 కోట్లు, ముఖ్యమంత్రి గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకానికి రూ.2,200 కోట్లు, చెన్నైలో భూగర్భ జలాల పునరుద్ధరణకు, వరదలను ఎదుర్కోవడానికి సహాయపడే 'స్పాంజ్ పార్కుల'కు రూ.88 కోట్లు కేటాయింపులలో ఉన్నాయి. ఇంజనీరింగ్, ఫౌండ్రీ పరిశ్రమలలో అత్యుత్తమ ప్రతిభకు పేరుగాంచిన కోయంబత్తూరు ప్రాంతాన్ని ఆధునిక పారిశ్రామిక కేంద్రంగా మార్చడానికి, కోయంబత్తూరులోని సూలూరులో 100 ఎకరాల విస్తీర్ణంలో, పల్లడం సమీపంలో 100 ఎకరాల విస్తీర్ణంలో సెమీకండక్టర్ తయారీ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెన్నరసు ప్రకటించారు. కోయంబత్తూరులోని అవినాశి రోడ్, సత్యమంగళం రోడ్ మార్గాల్లోని మెట్రో రైలు ప్రాజెక్టులకు రూ.10,740 కోట్ల అంచనాతో కూడిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు, మధురైలోని తిరుమంగళం-ఒతకడై కారిడార్‌కు రూ.11,368 కోట్ల అంచనాతో కూడిన కేంద్ర ప్రభుత్వం నుండి ఈక్విటీ సహకారం కోసం సమర్పించినట్లు బడ్జెట్‌లో వివరించారు.

ఆమోదం పొందిన వెంటనే రెండు నగరాల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. చెన్నై సమీపంలో 2,000 ఎకరాలకు పైగా గ్లోబల్ సిటీని అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. ఇందులో పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ సంస్థలు, మౌలిక సదుపాయాలు ఉంటాయి. గృహ సౌకర్యాలు కూడా నిర్మించడం జరుగుతుంది. విశాలమైన రోడ్లు, పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు.

ద్విభాషా విధానంపై రాజీ లేదు

తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వం ద్విభాషా విధానంపై తన వైఖరిపై దృఢంగా ఉందని అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) లోని త్రిభాషా విధానాన్ని ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ నిధులను నిలిపివేసిందని తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు ఆమోదించబడిన రూ.2,152 కోట్ల మొత్తాన్ని నిలిపివేసింది. త్రిభాషా విధానాన్ని కలిగి ఉన్న కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రం అంగీకరించకపోవడాన్ని దీనికి నిదర్శనం. అయినప్పటికీ, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యకు స్వల్పంగానైనా నష్టం వాటిల్లకుండా చూసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచి ఉపాధ్యాయుల జీతాలతో సహా నిధులు కేటాయించింది. ఈ క్లిష్టమైన సమయంలో కూడా రూ.2 వేల కోట్ల రూపాయలు వదులుకున్నప్పటికీ, ద్విభాషా విధానంపై దృఢంగా నిలబడటం ద్వారా రాష్ట్ర గౌరవాన్ని నిలబెట్టినందుకు తమిళనాడు ప్రజలు హృదయపూర్వకంగా ముఖ్యమంత్రికి మద్దతు ఇచ్చారు' అని మంత్రి అన్నారు.

తమిళ భాష... సాహిత్య ప్రచారం... ఏటా తమిళ ఒలింపియాడ్

రాష్ట్ర పాఠ్యపుస్తక సంస్థ ద్వారా ఎంపిక చేసిన 500 తమిళ పుస్తకాలను ఇతర భాషల్లోకి అనువదిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, తిరువనంతపురం, సింగపూర్, కౌలాలంపూర్‌లో పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఏటా ప్రపంచ తమిళ ఒలింపియాడ్ నిర్వహించబడుతుందని కూడా ఆయన ప్రకటించారు. మధురైలో 'అగరం' - ఒక భాషా మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. డీఎంకే ప్రభుత్వం త్వరలో ఈ-స్కూటర్లు కొనుగోలు చేసే గిగ్ వర్కర్లకు రూ.20,000 విస్తరించే కార్యక్రమాన్ని ప్రారంభించనుందని ఆయన చెప్పారు.

హోలీ, నమాజ్ ప్రశాంతం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా హోలీ పండుగ, శుక్రవారం ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. రంగులు చల్లుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ ప్రజలంతా హోలీ పండుగ జరుపుకున్నారు. మరోవైపు రంజాన్ మాసంలో రెండవ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలను ముస్లింలు శాంతియుతంగా నిర్వహించారు. హోలీకి విఘాతం కలిగించకుండా తమ ప్రార్థన సమయాన్ని ముస్లింలు మార్చుకొన్నారు. అన్ని చోట్ల ప్రజలు సామరస్యంగా మెలిగారు. హోలీ వేడుకలు, ముస్లింల ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకున్నారు. అయితే అవాంఛనీయ ఘటనలు జరుగుతాయన్న దృష్ట్యా సున్నిత ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను అధికారులు చేశారు. ఢిల్లీలో 25వేల మందికిపైగా భద్రతా సిబ్బందిని మోహరించారు. 300 సున్నిత ప్రాంతాలపై సీసీటీవీ, డ్రోన్లతో నిఘా పెట్టారు. ట్రాఫిక్, నగర పోలీసులు ఉమ్మడి పికెట్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి తాగి వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘటనలపై నిఘా పెట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లో గట్టి భద్రత నడుమ హోలీ వేడుకలు, శుక్రవారం ప్రార్థనలు ప్రశాంతంగా సాగాయి. హోలీ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం 'చౌపాయి కా జులుస్' (ఊరేగింపు)ను సంభల్ నగరంలో నిర్వహించారు. ముస్లింల ప్రార్థనలను సంప్రదాయానికి భిన్నంగా మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగాయి. పోలీసులు, జిల్లా యంత్రాంగం, ఆర్‌ఏఎఫ్ సంయుక్తంగా నగరంలో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించారు. రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సందర్భంగా శాంతి, సౌభాగ్యాలు, సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, అసోం సీఎం హిమంతా బిశ్వ శర్మ, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ ఖటారియా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తదితరులు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అధికారంలో ఉన్న వారితో కలిసి మైనారిటీలను భయపెట్టే సందర్భంగా హోలీ పండుగను కొందరు మార్చివేశారని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు.

ఇదిలావుంటే, హోలీ సందర్భంగా ఆర్చీ కామిక్ పబ్లికేషన్స్ సహ-సీఈవో నాన్సీ సిల్బర్‌క్లైట్ 'ది వరల్డ్ ఆఫ్ బెట్టీ అండ్ వెరోనికా డైజెట్ 38'ను ఆవిష్కరించారు. ఈ కథలో పాత్ర ఆర్చీ, అతని మిత్రులతో కలిసి హోలీ గురించి తెలుసుకుంటారు. భారత్‌లో తనకు కలిగిన అద్భుత అనుభూతిని ఈ రూపంలో పంచుకున్నట్లు నాన్సీ వెల్లడించారు.

కశ్మీర్‌లో 60 మంది విదేశీ ఉగ్రవాదులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం 60 మంది విదేశీ ఉగ్రవాదులు క్రియాశీలకంగా పనిచేస్తున్నారని ఓ నివేదిక వెల్లడించింది. దీంట్లో 35 మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులే ఉన్నారు. కశ్మీర్‌లో జరుగుతున్న చొరబాటుదారుల హింసలో 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నట్లు పేర్కొన్నారు. విదేశీ ఉగ్రవాదుల జాబితాలో లష్కరే తోయిబాతో పాటు జైషే మొహమ్మద్, హిజ్‌బుల్ ముజాయిద్దీన్ తీవ్రవాదులు కూడా ఉన్నారు. క్రియాశీలకంగా పనిచేస్తున్న వారిలో 21 మంది జైషే మొహమ్మద్, ముగ్గురు హిజ్‌బుల్ ఉగ్రవాదులు ఉన్నారు. యాక్టివ్‌గా ఉన్న 17 మంది స్థానికుల్లో... 14 మంది శ్రీనగర్ నుంచి పనిచేస్తున్నారు. మరో ముగ్గురు జమ్మూ సెక్టార్ నుంచి యాక్టివ్‌గా ఉన్నారు.

శివసేన నేత కాల్చివేత

చండీగఢ్: శివసేన జిల్లా అధ్యక్షుడిపై కొందరు దుండగులు కాల్పులు జరిపి హత్య చేసిన ఘటన పంజాబ్‌లోని మోగా జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే.... గురువారం రాత్రి 10 గంటల సమయంలో శివసేన జిల్లా అధ్యక్షుడైన మంగత్ రాయ్ ఓ షాపు వద్ద పాలు కొంటున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అక్కడకు వచ్చారు. మంగత్ రాయ్‌పై కాల్పులు జరిపారు. అయితే బుల్లెట్ ఆయన పక్కన ఉన్న 12 ఏళ్ల బాలుడికి తగలడంతో అతడు గాయపడ్డాడు. కాగా, అప్రమత్తమైన మంగత్ రాయ్ వెంటనే బైక్‌పై అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దుండగులు ఆయనను వెంబడించారు. మరోసారి ఆయనపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయారు. రక్తం మడుగుల్లో రోడ్డుపై పడిన మంగత్ రాయ్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తొలుత కాల్పుల్లో గాయపడిన బాలుడిని మోగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మరో కార్పొరేట్ ఆసుపత్రికి అతడిని పంపించారు. మంగత్ రాయ్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. ఇదిలా ఉండగా, శివసేన నేతలు రోడ్డుపై బైఠాయించి మంగత్ రాయ్ హత్యపై నిరసన తెలిపారు.

పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్ అరెస్ట్

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో అనుమానిత ఐఎస్ఐ ఏజెంట్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. లక్నో ఎందుకు వచ్చాడు ... అనే కోణంలో యూపీ ఏటీఎస్ అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా, గత కొద్దిరోజులుగా యూపీ ఎస్‌టీఎఫ్, పంజాబ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో జబ్బర్ ఖల్సాకు చెందిన ఉగ్రవాదిని ఈ నెల ఆరో తేదీన యూపీలోని కౌశాంబి జిల్లాలో అరెస్టు చేశారు. అరెస్టయిన ఉగ్రవాది లాజర్ జర్మనీకి చెందిన జబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ మాడ్యూల్ చీఫ్ స్వర్ణ్ సింగ్ అలియాస్ జీవన్ ఫౌజీ కోసం పని చేస్తున్నాడు. పాక్‌కు చెందిన ఐఎస్ఐ ఉగ్రవాదులతో ప్రత్యక్ష సంబంధాలున్నాయి. ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్ వస్తున్న భక్తులతో కూడిన బస్సును పేల్చేందుకు లాజర్ కుట్ర పన్నినట్లు వెల్లడైంది.

పోక్సో కేసులో యడియూరప్పకు ఊరట

బెంగళూరు: మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఓ బాలికను లైంగికంగా వేధించిన కేసులో కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పకు న్యాయస్థానం స్వల్ప ఊరట కల్పించింది. మార్చి 15న పోక్సో కేసు విచారణకు హాజరుకావాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇటీవల ఆయనను ఆదేశించింది. తాజాగా కర్నాటక హైకోర్టు ఆ కేసుకు సంబంధించిన సమన్లను నిలిపివేసింది. 17 ఏళ్ల బాలికపై యడియూరప్ప లైంగిక దాడికి పాల్పడినట్లు గతంలో ఆరోపణలు వచ్చాయి. ఓ మోసం కేసులో సాయం చేయాలంటూ బాధితురాలు, ఆమె తల్లి గత ఏడాది ఫిబ్రవరి 2న యడియూరప్పను కలిశారు. ఆ సమయంలో తన కుమార్తెను యడియూరప్ప బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారంటూ బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు.

క్షమాపణ చెప్పను: తుషార్ గాంధీ

ఆయన అరెస్టుకు బీజేపీ ఆర్ఎస్ఎస్ డిమాండ్

తిరువనంతపురం: మహాత్మాగాంధీ ముని మనుమడు తుషార్ గాంధీ అరెస్టునకు ఆర్ఎస్ఎస్, బీజేపీ డిమాండ్ చేశాయి. గాంధీ పేరును అడ్డం పెట్టుకొని ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఆరోపణలు గుప్పించాయి. తుషార్ గాంధీ శుక్రవారం కొచ్చి, అలువాలోని కార్యక్రమంలో మాట్లాడుతూ 'నా మాటలను వెనక్కి తీసుకోను. ఎవరికి క్షమాపణ చెప్పను' అని అన్నారు. దేశ ద్రోహులను బహిర్గతం చేయాలన్న తన సంకల్పం తాజా ఘటనతో మరింత బలపడిందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటం కంటే కూడా ఈ పోరాటమే ముఖ్యమని, మనకున్న ఉమ్మడి శత్రువు 'సంఘ్' అని వ్యాఖ్యానించారు. తన ముత్తాత హంతకుల వారసులు అలవాటు ప్రకారం మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి దానిపై కాల్పులు జరుపుతారన్న ఆందోళన తనకున్నదని తుషార్ అన్నారు. ఇదిలావుంటే, తిరువనంతపురంలోని నెయ్యంటికారాలో గాంధేయవాది పి.గోపినాథన్ నాయర్ విగ్రహావిష్కరణ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ప్రమాదకర శత్రువులుగా తుషార్ వర్ణించారు. 'ఆర్ఎస్ఎస్ విషం లాంటిది. ప్రమాదకర శత్రువులు ఇప్పుడు కేరళలోకి ప్రవేశించారు' అని వ్యాఖ్యానించారు. దీంతో ఆయనపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ వర్గాలు విరుచుకుపడ్డాయి. ఆయన కారును దిగ్బంధించాయి. వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. ఆయన గాంధీ కుటుంబంలో జన్మించారు తప్ప గొప్పగా సాధించినదేమీ లేదని బీజేపీ విమర్శించింది. బీజేపీ నేత వి.మురళీధరన్ స్పందిస్తూ తుషార్ గాంధీ మహాత్మా గాంధీ పేరు చెప్పుకుంటూ లబ్ధి పొందుతున్నారని, విగ్రహావిష్కరణకు తుషార్‌ను ఆహ్వానించిన వారికి ఆయన నేపథ్యం తెలియదేమోనంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ ఫిర్యాదు ఆధారంగా తుషార్ గాంధీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తుషార్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చిన ఐదుగురు ఆర్ఎస్ఎస్-బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేసినందుకుగాను పినరయి విజయన్ ప్రభుత్వాన్ని మురళీధరన్ విమర్శించారు. అయితే సంఘ్ పరివార్ దాడిని కేరళ సీఎం తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ అణచివేత ఆక్షేపణీయమని విజయన్ తేల్చిచెప్పారు.

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా : తమ ప్రభుత్వం రాష్ట్ర రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం అన్నారు. 2007లో తీవ్ర భూసేకరణ వ్యతిరేక ఉద్యమంలో నందిగ్రామ్‌లో ప్రాణాలు కోల్పోయిన 14 మంది రైతుల జ్ఞాపకార్థం తృణమూల్ కాంగ్రెస్ ప్రతి సంవత్సరం మార్చి 14న 'కృషక్ దివస్'గా పాటిస్తోంది. 'ఎక్స్' లో బెనర్జీ ఒక పోస్ట్‌లో... రైతులు ఏడాది పొడవునా కష్టపడి పని చేస్తున్నారు. వారి కృషిని నేను అభినందిస్తున్నాను. వారు మాకు గర్వకారణం' అని పేర్కొన్నారు. 'మా పరిమిత సామర్థ్యంలో బెంగాల్‌లోని మా రైతు సోదరసోదరీమణులకు మేము చేయగలిగినంత చేయడానికి ప్రయత్నిస్తాం. 'కృషక్ బంధు' పథకం కింద ఆర్థిక సహాయం, పని చేస్తున్నప్పుడు మరణం సంభవించినప్పుడు నగదు సాయం, పంట బీమా ప్రీమియంల పూర్తి ఖర్చును భరించడం, ప్రకృతి వైపరీత్యాల విషయంలో ఆర్థిక సహాయం, రైతుల నుంచి సరసమైన ధరకు వరి కొనుగోలు, రైతు పెన్షన్ అందించడం, 186 'కిసాన్ మండీలు' ప్రారంభించడం, ఉచిత వ్యవసాయ యంత్రాలను అందించడం - మేము ప్రతిదీ చేస్తాం' అని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2019లో 'బంగ్లా సశ్య బీమా' (బెంగాల్ పంట బీమా ప్రాజెక్టు) ను కూడా ప్రారంభించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'రాబోయే రోజుల్లో మా ప్రభుత్వం ఈ విధంగా మా రైతు స్నేహితులకు అండగా నిలుస్తుంది' అని బెనర్జీ నొక్కి చెప్పారు.

రూ.1000 కోట్ల మద్యం కుంభకోణం

స్టాలిన్ సర్కార్‌పై బీజేపీ ఆరోపణ

చెన్నై: తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ ద్వారా సీఎం స్టాలిన్ ప్రభుత్వం రూ.1000 కోట్ల మద్యం కుంభకోణానికి పాల్పడిందని బీజేపీ సంచలన ఆరోపణ చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరిపిన దాడుల్లో ఆర్థిక అవకతవకలు జరిగినట్టు వెల్లడైందని చెప్పింది. మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే త్రిభాషా విధానంపై స్టాలిన్ వదంతులు వ్యాప్తి చేస్తున్నారని విమర్శించింది. ఇదిలా ఉండగా, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని డీఎంకే కొట్టివేసింది. ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం 2025-26 బడ్జెట్ ప్రవేశపెట్టింది. రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెనరసు వివిధ సంక్షేమ పథకాలను బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉపాధి కల్పన, మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయింపులు జరిపారు. ఇదే సందర్భంగా ఈడీ దాడుల్లో ఆర్థిక అవకతవకలు, లిక్కర్ కుంభకోణం వెలుగుచూసినట్టు అన్నాడీఎంకే సభ్యులు ఆరోపిస్తూ, ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభనుంచి వాకౌట్ చేశారు. లిక్కర్ మంత్రి, లిక్కర్ సప్లయ్ కంపెనీలపై ఈడీ దాడులు జరుగుతున్నందున ప్రజల దృష్టిని మళ్లించేందుకు త్రిభాషా విధానం, ఎన్ఈపీపై స్టాలిన్ తప్పుడు వదంతలను ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేత అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈడీ దాడుల్లో డిస్టిలరీల నుంచి ముడుపుల రూపంలో వసూలై, లెక్కల్లో చూపించని రూ.వెయ్యి కోట్ల లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోందని, ఈ అక్రమ చెల్లింపులు ఎవరు అందుకున్నారో సీఎం వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాగా, మద్యం కుంభకోణం ఆరోపణలపై రూల్ 55 కింద ప్రభుత్వం వివరణ ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ రాశారు.

అవకతవకలకు అవకాశమే లేదు: మంత్రి సెంథిల్

టీఏఎస్ఎంఏసీ ఆపరేషన్స్‌లో అవకతవకలకు అవకాశమే లేదని తమిళనాడు ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ తెలిపారు. సోదాల పేరుతో ఈడీ దాడులు చేసినప్పటికీ ఏ సంవత్సరంలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారో చెప్పలేదన్నారు. పొరపాట్లు జరిగి ఉండవచ్చనే అభిప్రాయంతో లేనిపోని ఆరోపణలకు దిగడం సరికాదన్నారు. గత నాలుగేళ్లుగా బార్ టెండర్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే జరుగుతోందని, ఏ ఆధారంతో రూ.వెయ్యి కోట్ల అవినీతి జరిగిందని వారు చెబుతున్నారని విపక్షాలను ప్రశ్నించారు.

మాకు ఒక భార్య... ఒక భర్తే

ఉత్తరాదిపై మంత్రి దురైమురుగన్ ఎద్దేవా

చెన్నై: ఉత్తర, దక్షిణ భారతాల మధ్య పెరుగుతున్న వివాదానికి తమిళనాడు సీనియర్ మంత్రి దురైమురుగన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్టుగా మారాయి. ఉత్తర భారతంలో బహుభర్తృత్వం (ఒకే స్త్రీకి అనేకమంది భర్తలు), బహుపత్నిత్వం (ఒకే పురుషునికి అనేక మంది భార్యలు) సర్వసాధారణమని ఆయన ఆరోపించారు. తమిళ భాషను అవమానించిన వారి నాలుక కోస్తామని హెచ్చరించారు. దేశంలో జనాభా ఆధారంగా ప్రతిపాదించిన పునర్విభజనపై ఇప్పటికే ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ఈ వ్యాఖ్యలు మరింత వివాదాస్పదమయ్యాయి. శుక్రవారం ఇక్కడ జరిగిన ఓ సభలో దురైమురుగన్ మాట్లాడుతూ మహాభారతాన్ని ఉటంకించారు. ఉత్తర భారతంలో ఒక స్త్రీ అనేకమంది పురుషులతో వివాహం చేసుకునే సంప్రదాయం ఉందని అన్నారు. 'మా సంస్కృతిలో ఒక పురుషుడు ఒక స్త్రీని వివాహం చేసుకుంటాడు. కానీ ఉత్తర భారతంలో ఒక స్త్రీ ఐదు లేదా పది మంది పురుషులను వివాహం చేసుకోవచ్చు. అక్కడ ఐదుగురు పురుషులు ఒక స్త్రీని వివాహం చేసుకోవచ్చు. అది వారి సంస్కృతి' అని ఆయన అన్నారు. పునర్విభజనపై తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం, కేంద్రం మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ ప్రక్రియ కొత్త జనాభా లెక్కల ఆధారంగా జరిగితే రాష్ట్రంలో పార్లమెంటరీ స్థానాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని తమిళనాడు ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై దురైమురుగన్ కేంద్ర ప్రభుత్వ యోచనను ఖండిస్తూ... 'జనాభా నియంత్రణ చేయమని మమ్మల్ని అడిగారు. మేం చేశాం. మా జనాభా తగ్గింది. కానీ ఉత్తర భారతంలో 17-18 మంది పిల్లలను కంటున్నారు. వారికి వేరే పని లేదు' అని అన్నారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంటులో డీఎంకే ఎంపీలపై చేసిన వ్యాఖ్యలకు తమిళనాడు మంత్రి తీవ్రంగా స్పందించారు. 'తమ సంస్కృతి మర్యాదకరంగా లేని వారు మా సంస్కృతిని అమర్యాదకరమని అంటున్నారా? వారి నాలుక కోస్తాం. జాగ్రత్తగా ఉండండి' అని ఆయన అన్నారు.

అమ్మాయి వలపు వల...

పాక్‌కు మిలిటరీ రహస్యాలు

ఫిరోజాబాద్: పాకిస్థాన్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తూ... భారత రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ అమ్మాయి వలపు వలలో చిక్కిన అతడు... భారత సైన్యం ఆయుధాలకు సంబంధించిన సున్నితమైన సమాచారంతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలు అందించినట్లు విచారణలో తేలింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవీంద్ర కుమార్ ఫిరోజాబాద్‌లో హజ్రత్‌పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది అతడికి నేహా శర్మ అనే మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కోసం పనిచేస్తున్న ఆమె... ఆ విషయాన్ని దాచిపెట్టి రవీంద్రతో స్నేహం చేసింది. డబ్బుల ఆశ జూపి వలపు వల విసిరింది. అనంతరం అతడి నుంచి మిలిటరీ రహస్యాలను సంపాదించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. చంద్రన్ స్టోర్‌కీపర్ పేరుతో ఆమె నంబరును సేవ్ చేసుకున్న రవీంద్ర... వాట్సప్‌లో ఆమెకు అనేక కీలక పత్రాలు పంపించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, 51 గోరా రైఫిల్స్ రెజిమెంట్ అధికారులు నిర్వహించిన లాజిస్టిక్స్ డ్రోన్ పరీక్షలు, రోజువారీ ఉత్పత్తి వివరాలు, స్క్రీనింగ్ కమిటీ పంపిన రహస్య లేఖలను సంపాదించి... వాటిని ఆ మహిళకు పంపించినట్లు తెలిసింది. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. భారత రక్షణ రంగ ప్రాజెక్టులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని వారికి పంపించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడితో పాటు అతడి స్నేహితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తా అనడం హాస్యాస్పదం : ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : అసెంబ్లీలో జగదీశ్వర్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పు పడుతు సస్పెన్షన్ విధించారని, అయితే జగదీశ్వర్ రెడ్డిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసే దాకా కేటీఆర్ అమర నిరాహార దీక్ష చేస్తాననడం విడ్డూరంగా ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ అన్నారు. కేటీఆర్ మీకు దళితులపై దళిత నాయకత్వంపైన ఉన్నటువంటి ఆలోచన విధానాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని ఓ ప్రకటనలో తెలిపారు. మా స్పీకర్ ప్రసాద్ ని అవమానించారు గతంలో కూడా మీ పార్టీ మీ ప్రభుత్వం కూడా దళితులకు ఎక్కడ విలువనివ్వలేదన్నారు. ఉద్యమం మొదలుపెట్టినప్పుడు నుండి దళితుడే తెలంగాణకు మొదటి ముఖ్యమంత్రి అవుతాడు అని చెప్పిన మీ నాయన నాటి నుండి నేటి వరకు దళితులను వంచిస్తూనే ఉన్నారని విమర్శించారు. ఆరోజు మీ ప్రభుత్వంలో నామ మాత్రంగా రాజయ్యని ఉపముఖ్యమంత్రిగా చేసి నాలుగు దినాలైనా ఉండకుండా భర్తరఫ్ చేశారు. ఎందుకు భర్త రఫ్ చేశారు అనేది ఇంతవరకు కూడా వెల్లడించలేదన్నారు. ప్రణబ్ ముఖర్జీ వస్తే కాళ్లకు దండం పెడతారు. అదే రామ్నాథ్ కోవింద్ వస్తే కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని దుయ్యబట్టారు. 10 సంవత్సరాలు ప్రభుత్వంలో ఉన్న మీరు స్పీకర్ కూర్చున్న విలువ ఏంటో తెలుసుకొని మాట్లాడాలన్నారు. దళిత స్పీకర్ను అవమానించి, మళ్లీ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి అమర నిరాహార దీక్ష చేస్తాననడం సిగ్గుచేటన్నారు. కేటీఆర్ మీకు దళితుల మీద ఎటువంటి చిత్త శుద్ధి లేదు ఇటువంటి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ అసెంబ్లీని స్తంభింప చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్ మీ డ్రామాలన్నీ తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు అమర నిరాహార దీక్ష చేస్తా అనే పిచ్చి ఆలోచనలను మానుకోవాలని సూచించారు.

నిరుపేద కుటుంబానికి జగదీష్ గౌడ్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఓల్డ్ నేరెడ్ మెట్‌లో పేదింటి కుటుంబానికి చెందిన అఖిల తల్లిదండ్రులు చిన్నప్పుడే మరణించడంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కార్యకర్తలు మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన రూ.7000, బియ్యం 100 కిలోలు, నూనె ఇతర వంట సామాగ్రి అఖిల అమ్మమ్మ అయినా అండాలమ్మకు కాలనీ మహిళలతో కలిసి ఆర్థిక సాయం చేశారు. మల్కాజిగిరి ప్రజల అండగా ఉంటానని ఎవరు కూడా నిరాశ పడకూడదని ధైర్యం చెప్పడంతో కాలనీవాసులు చాలా సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, సాయినాథ్, జయరాం, నవీన్ గౌడ్, బాబా, భవాని, విజయలక్ష్మి, టింకు గౌడ్, శ్రీనాథ్, పద్మ, కల్పన, స్వరూప, జయశ్రీ, చోటు, సిద్దు, విశాల్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

భాదితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : వివేకానంద నగర్ డివిజన్ బస్తికి చెందిన ఎల్.వనిత అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌ని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించి మంజూరైన 1,50,000 లక్ష యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరి పత్రాలను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధితుడికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ నాయకులు రాఘవులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళన

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని శాసనసభ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదిలాబాద్ టూ ఆలంపూర్ తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను కాలబెట్టారు. ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా నినదించారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం అన్నారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకే సిఎం రేవంత్ రెడ్డి సస్పెన్షన్లను ఆయుధంగా మలుచుకున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు ప్రతిరూపమైన అసెంబ్లీని తన నియంతృత్వ పోకడలతో రేవంత్ రెడ్డి భ్రష్టుపట్టించారని విరుచుకుపడ్డారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా చెప్పుకోవడానికి ఒక్క మంచి పని కూడా చెయ్యని రేవంత్ రెడ్డి, తన చేతకానితనం బయటపడొద్దనే అసెంబ్లీలో బీఆర్ఎస్ నాయకులపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కితే ప్రజా కోర్టులో తేల్చుకుంటామన్నారు. పార్టీ పిలుపు మేరకు తెలంగాణ గ్రామ గ్రామాన సమరోత్సాహంతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వాన్ని ఎండగట్టిన కార్యకర్తలు, నాయకులకు కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను, హామీల అమలు మోసాన్ని ఇదే స్ఫూర్తితో ఎప్పటికప్పుడు ఎండగడదామని పిలుపునిచ్చారు.

ఘనంగా హోలీ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బంజారాహిల్స్ డివిజన్ 93 ఎన్.బీ.టీ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కాముడు దహనం కార్యక్రమంలో బస్తివాసులతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ప్రజలందరికీ హోలీ పండుగ శభాకాంక్షలు తెలియజేవారు. ఒకరికి ఒకరు హోలీ రంగులు పూసుకొని ఘనంగా హోలీ పండుగ జరుపుకొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : హోలీ పండుగ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో పరిధిలోని పలు కాలనీలో కాలనీ సభ్యులు ఏర్పాటు చేసిన హోలీ వేడుకల్లో ముఖ్యతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. హోలీ వేడుకలు ఆనందోత్సాహంతో నిర్వహించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : ప్రజలంతా పండుగలను సోదర భావంతో జరుపుకోవాలని కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. 130 డివిజన్ సుభాష్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి మహిళలతో కలిసి హోలీ పండుగ ఘనంగా జరిపారు. అనంతరం డివిజన్ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

విశాలాంధ్ర - ఆమనగల్లు : హోలీ వేడుకలు జోరుగా సాగాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి రంగులు పూసుకుంటూ డ్యాన్సులు వేస్తూ హోలీ పండుగచేసుకున్నారు. హోలీ సందర్భంగా పోలీసులు ఆంక్షలు విధించారు. బహిరంగ ప్రదేశాల్లో హోలీ వేడుకలు నిషేధించారు. అపరిచితులపై రంగులు వేయరాదన్నారు. భవనాలు, వాహనాలపై రంగులు పోయవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. రంగుల పండుగ కేరింతలు,ఆనందోత్సవాల మధ్య శుక్రవారం ప్రజలు హోలీ పండుగను జరుపుకొన్నారు. పల్లె, పట్టణం ఏ వీధిలో చూసినా హోలీ వేడుకలు కనువిందు చేశాయి. చిన్నారులు, యవతీయువకులు, పెద్దలు రంగుల్లో మునిగి తేలారు. పలుచోట్ల హోలీ సందర్భంగా కామదహనంనిర్వహించారు. చిన్నా పెద్దా కలిసి ఆడిపాడుతూ రంగులు పూసుకుంటూ సందడి చేశారు. హోలీ సంబరాలల్లో ఆనందం, ఐక్యతను నింపే పండుగ హోలీ అని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి చెప్పారు. శుక్రవారం ఆమనగల్లులో ఆయన హోలీ వేడుకలలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులతో కలిసి రంగులు చల్లుకొని హోలీ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దుండిగల్: ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య రంగులతో జరుపుకొనే ప్రకృతి పండుగ హోలీ అని బిజెపి దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్న హోలీ పండుగ సంబరాలలో బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి పాల్గొని ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పండగలు మన సంస్కృతికి ప్రతీకలని, పర్యావరణంతో మమేమకమై జీవించాల్సిన బాధ్యతను గుర్తుచేసే హోలీ పండుగ అందరి జీవితాల్లో రంగులు నింపాలని ఆయన వెల్లడించారు.

హోళి రోజున నీటిలో రంగులు కలిపి ఒకరిపై ఒకరు చల్లుకుని యువకులు సంతోషంగా సరదాగా గడుపుతారని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోనె మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సీతారాం రెడ్డి, ఆర్ నర్సింహాచారి, జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అందె అశోక్, సిద్దం శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు లక్ష్మరెడ్డి, బొక్క జీవన్‌రెడ్డి, నాసి శ్రీపాల్ రెడ్డి, గోనె అనంతరెడ్డి, కమ్మరి శ్రీనివాస్, బాలకృష్ణ, నాగశేషులు, కోల సూర్య ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్ సురేందర్ రెడ్డి, ఆకుల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- ఆమనగల్లు : కామ దహనం కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో గాంధీ చౌరస్తా వద్ద కట్టెలు పేర్చి కాముని ప్రతిమకు అర్చకులు వెంకటేశ్వర శర్మ ప్రత్యేక పూజలు అనంతరం వంశపార్యపర్యంగా వస్తున్న ఆచార వ్యవహారాలతో, కడ్తాల్ గ్రామ పెద్దల సమక్షంలో పూజలు నిర్వహిస్తుండగా కాముని దహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ వేడుకలను చూసేందుకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు మహేష్, మాజీ వార్డు సభ్యులు హెచ్ఆర్ మహేష్, నరేందర్ రెడ్డి, గణేష్, ఎర్రోళ్ల రాఘవేందర్, గ్రామ పెద్దలు సాయి రెడ్డి, వెంకటరెడ్డి, సురేందర్ రెడ్డి, జంగారెడ్డి, శేఖర్ రెడ్డి, సత్యం, దూదేరాములు, పాండు, మూడ రవి, మహేష్, సురేష్, లాయర్ సంతోష్, దేవేందర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదే

శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణ ప్రసాద్

విశాలాంధ్ర - హైదరాబాద్ : యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకుల దేనని, భగత్ సింగ్ కలలుగన్న అవినీతి, దోపిడీ, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు పౌరులంతా కృషి చేయాలని శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని క్రికెట్ గ్రౌండ్లో రెండవ రోజు ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండవ రోజు పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు కరచాలనం చేసి అభినందించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నో క్రీడలు అంతరించి పోతున్నాయని వాటిని గుర్తించి కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనని వారు డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం చిరు ప్రాయంలోనే పోరాడి వీరమరణం పొందారని అటువంటి భగత్ ఆశయ సాధనలో నేటి యువత పాటుపడాలని వారు అన్నారు. భగత్ కలలుగన్న అవినీతి, అక్రమాలు, దోపిడీ లేని సమసమాజ స్థాపనకు నేటి యువత నడుంబిగించాలని వారు ఉద్ఘాటించారు. కానీ నేడు దేశంలో అవినీతి, అక్రమాలతో కూడిన రాజకీయాలు సమాజాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసేలా ఉన్నాయని, రాజకీయాలంటే కార్పొరేట్ శక్తులు మాత్రమే అనేలా అపహాస్యం చేసేలా ఉన్నాయని, సేవ చేయాలనే యువత ఆలోచనలను నేటి పాలకులు కుతంత్రాలతో నాశనం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులలో ఆర్థిక అరాచకాలు, నేరాలు చేసిన వారే ఉన్నారని ఇది మన దేశ భవిష్యత్‌కు పెను ప్రమాదమని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కార్యవర్గ సభ్యులు మాజీద్, కళ్యాణ్, అనిల్, హేమంత్, బాలు, విజయ్, మహేష్‌తో పాటు 10 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర-దుండిగల్: తన చేతకానీ తనాన్ని కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ చిల్లర మాటలు మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్,ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల నగరంలోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిసి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్ల పాటు శాంతియుత ఉద్యమాలు చేసి, రాష్ట్రాన్ని సాధించి 10 సంవత్సరాలు ప్రజలతో ఎన్నుకోబడి బంగారు రాష్ట్ర సాధనకై కృషి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చావు కోరుతూ అనుచిత వ్యాఖ్యలు చేసి రాష్ట్ర ప్రజలు, కెసిఆర్ అభిమానుల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా రెచ్చగొడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రజలు సంయమనాన్ని కోల్పోవద్దని కాలమే వారికి సరైన బుద్ధి చెబుతుందని, కెసిఆర్, తెలంగాణ సమాజంతో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారని వారు తెలిపారు. తమ స్వార్థ చిల్లర రాజకీయాల కోసం బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తమ స్వార్థం కోసం ఎదుటి ఎదుటివారి నాశనాన్ని కోరుకునే నైజాన్ని, ముఖ్యమంత్రి మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఎదుటివారి వినాశనాన్ని కోరుకోవడం సిగ్గుచేటని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను, కెసిఆర్ అభిమానులను, బిఆర్ఎస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలను తీవ్ర మన వేదనకు గురిచేసాయని, తమ స్వార్థ రాజకీయాల కోసం చిల్లర మాటలు మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌ని కలిసిన శిరీష

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : అవనీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో మార్చి 16వ తేదీన నిర్వహించే 5కే రన్‌లో పాల్గొనాలని పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌ని ఆమె మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. మహిళలకు అన్ని రంగాలలో పెద్దపీట వేస్తూ, మహిళలకు ప్రతి చోట గౌరవించాలని, విలువ ఇవ్వాలని, వారి అభ్యున్నతి కొరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుకుంటూ మార్చి 16వ తేదీన శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో జరుగుతున్న 5కే రన్ కార్యక్రమానికి అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు పిలుపునిచ్చారు.

ఘనంగా నీలం మధు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : కాంగ్రెస్ నేత, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో నీలం అభిమానులు బర్త్‌డే కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకోవడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు జరిపించారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నీలం మధు స్వామి వారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం జిన్నారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. పటాన్‌చెరు పట్టణంలో ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు మన్నె ప్రశాంత్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్, పెన్నులు అందించారు. గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం దాచర్లపల్లి, సిరిసిల్ల జిల్లా మాడేపల్లిలో ఎన్ఎంఆర్ అభిమానుల ఆయా అనాథాశ్రమలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్ఎంఆర్ అభిమానులు రక్తదానం చేయడంతో పాటు ఆసుపత్రి ఆవరణలో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు జరిపారు. వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో ఎన్ ఎం ఆర్ యువసేన సభ్యులు కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో పనులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నాయకులు, నీలం అభిమానులు పాల్గొన్నారు.

మానవ జీవన విధానానికి ప్రతీక హోలీ పండుగ

మాజీ మంత్రి హరీష్‌రావు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : హోలీ పర్వదిన సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుని కలిసి హోలీ శుభాకాంక్షలు తెలియజేసిన కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్. హోళి పండగ సందర్భంగా పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ భారతీనగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డితో పాటు కలిసి మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రజలకు హోళి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల పండుగ హోళి లాగే మన జీవితంలో అన్ని రకాల పరిస్థితులను సంతోషంగా ఎదుర్కోవాలని, ఎంతసేపు మన గురించే కాక ఇతరుల జీవితాలలో కూడా ఆనందాల రంగులు నింపేలా సంతోషమైన, దుఃఖమైన అందరితో పంచుకోవాలని కోరారు. హానికారక కెమికల్ రంగులు వాడి అనారోగ్యం పాలు కాకుండా ప్రకృతిసిద్ధమైన రంగులను వాడుతూ అందరూ ఆనందంగా హోళి జరుపుకోవాలని, అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనించాలని, చెరువులు, కుంటలు, బావుల వద్ద స్నానాలకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని కార్పొరేటర్ ప్రజలను కోరారు.

ఘనంగా గుర్రాల వెంకటేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ వార్డులో గుర్రాల వెంకటేష్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు సాయిరాం నగర్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ వచ్చి గుర్రాల వెంకటేష్ యాదవ్‌ని ఆశీర్వదించారు. తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ వెంకటేష్ యాదవ్ స్వయంగా ఎలాంటి బ్యాక్ సపోర్ట్ లేకుండా పైకి వచ్చిన వ్యక్తి అని, ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రజలకు సేవ చేస్తూ ముందుకు వెళ్తున్నాడని, ధైర్యశాలి, నిరాడంబరుడు, నిస్వార్థపరుడు, మృదు స్వభావి, చిన్నలకు పెద్దలకు అందరికీ విలువనిచ్చే వ్యక్తి అని, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుంటూ ప్రజలకు మంచి చేస్తూ మరింత పైకి ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, పెద్దలు, యూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పిల్లలు వచ్చి గుర్రాల వెంకటేష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బోడుప్పల్‌లో బీఆర్ఎస్ నాయకుల నిరసనలు

విశాలాంధ్ర - మేడిపల్లి: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పిలుపుమేరకు మాజీ మంత్రి మల్లారెడ్డి ఆదేశానుసారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శాసనసభలో తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం కేసీఆర్‌కు వెన్ను దన్నుగా ఉండి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం నిరంతరం కృషి చేసిన సీనియర్ శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు జగదీశ్వర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలి ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసినందుకు నియంతృత్వ కాంగ్రెస్ ప్రభుత్వం జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీలో సస్పెండ్ చేసినందుకు నిరసనగా శుక్రవారం ఉదయం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు మంద సంజీవరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ మేయర్ సామల బుచ్చి రెడ్డి, నాయకులు కొత్త చక్రపాణి గౌడ్, కొత్త రవి గౌడ్, కాటపల్లి రామచంద్ర రెడ్డి, బంధారం శ్రీధర్‌గౌడ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ఇంచార్జిలు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ యూత్ మాజీ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన నాయకులు ఉద్యమకారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు సిద్ధాంత కర్త కారల్‌మార్క్స్

విశాలాంధ్ర - కారేపల్లి : మార్క్సిస్టు సిద్ధాంత రూపకర్త కమ్యూనిజం సిద్ధాంత వేత్త మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్142 వర్ధంతిని సిపిఎం సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కారల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు తలారి దేవ ప్రకాష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి మండల కార్యదర్శి కే.నరేంద్ర అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ 200 సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని రచించిన మహో తత్వవేత్త ఆర్థికవేత్త విప్లవకారుడు మార్క్స్ అని అందుకే కారల్ మార్క్స్ ప్రపంచంలోనే అత్యున్నత మేధావిగా భావిస్తారని ప్రపంచాన్ని ప్రజలను ప్రభావితం చేసినవి మార్క్స్ రచనలు అని కొనియాడారు. దోపిడీ యొక్క రహస్యాన్ని గుట్టు విప్పి పేదవాడు అధికారంలోకి వచ్చే మార్గాన్ని కార్మిక కర్షక ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపే సిద్ధాంతంగా కమ్యూనిజన్ని మార్క్సిజాన్ని సోషలిజాన్ని తీర్చిదిద్దిన ఘనత అతనికి చెందుతుందన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యురాలు కే.ఉమావతి నాయకులు అన్నారపు కృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవాళి విముక్తికి మార్క్సిజమే మార్గం

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రపంచ మానవాళి విముక్తికి కమ్యూనిశమే మార్గమని సిపిఐ ఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు అన్నారు. కారల్ మార్క్స్ 142 వ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కారల్ మార్క్స్ రచనలలో "కమ్యూనిస్టు ప్రణాళిక, దాస్ క్యాపిటల్, పెట్టుబడి" గ్రంథాలు ప్రపంచ పెట్టుబడిదారులను ఉలిక్కిపడేలా చేసాయని, పెట్టుబడిదారీ విధానానికి మార్క్సిజమే సరైన మార్గమని పేర్కొన్నారు. కారల్‌మార్క్స్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన సభను నిర్వహించటం జరిగింది. ముందుగా కారల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. కారల్ మార్క్స్ మరణించి నేటికి 142 సంవత్సరాలు అవుతున్నా, ప్రపంచ వ్యాపితంగా మార్క్సిజమే అజేయంగా కొనసాగుతుం దని, పెట్టుబడిదారీ విధానాలకు ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని, అన్నారు. బిజెపి - ఆరెస్సెస్ విధానాలు మతోన్మాద కార్పొరేట్ శక్తుల పాలన కొనసాగిస్తుందని, విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, నవీన్‌రెడ్డి, మెరుగు రమణ జిల్లా నాయకులు ఆర్.ప్రకాష్, బండారు యాకయ్య, నర్రా రమేష్, ఎకడమిక్ జిల్లా బాధ్యులు బోడపట్ల రవీందర్, త్రీ టౌన్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డి శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : శాసనసభలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ని ఏకావచనంతో అవమాన పరిచిన మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అసెంబ్లీ సభ్యత్వం రద్దు చేయాలని ఎంపీ.మల్లురవి అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి మొదటి నుంచి దళితుల పట్ల చిన్న చూపు ఉందని మండిపడ్డారు. దళిత ముఖ్యమంత్రి ని చేస్తానని చెప్పిన కేసీఆర్ తర్వాత వారికి పాలన చేయరాదు అని అవమాన పరిచి తానే సీఎం అయ్యారని విమర్శించారు. గతంలో దళిత ఉప ముఖ్యమంత్రి రాజయ్యను బర్తరఫ్ చేసి అవమానపరిచారని ఆరోపించారు. 2017 లో దళిత ఎమ్మెల్యే సంపత్ కుమార్ సభ్యత్వం రద్దు చేశారని, తెలంగాణ బిల్లు

పాస్ చేసిన దళిత నేత లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ తెలంగాణకు వస్తే కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు.

ఇలా దళిత నేతల పట్ల మొదటి నుంచి బిఆర్ఎస్ అవమానకరంగా ప్రవర్తిస్తుందని అన్నారు. అసెంబ్లీలో స్పీకర్ దళిత నాయకులు ప్రసాద్ కుమార్ పట్ల ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అవమానపరిచే విధంగా మాట్లాడారని అన్నారు.

స్పీకర్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన జగదీశ్ రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డిది అరాచక పాలన

కేసీఆర్‌పై చేసిన హేయమైన వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి : దాసోజు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన నేరపూరిత, హేయమైన, అశ్లీల వ్యాఖ్యలను తక్షణమే ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. శుక్రవారం ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం, డా. దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి చేసిన "మీకు మీరూ, మాకు స్టాచర్ ఉందని అనుకుంటే, స్ట్రెచర్ మీదకి పంపించిండ్రు ఇట్లనే చేస్తే, ఆ తర్వాత మార్చురీకి పోతారు అనే వ్యాఖ్యల వెనుక తీవ్ర కుట్ర దాగి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డి హత్యా కుట్ర చేస్తున్నాడా లేదా ఓ ఎమ్మెల్యేతో కలిసి రేవంత్ రెడ్డి హత్యా కుట్ర చేస్తున్నాడా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ పై శారీరకంగా హాని చేయాలని ప్రయత్నం చేస్తున్నారా, ఎవరైనా హత్యకు గురైనపుడే మృతదేహం మార్చురీకి వెళ్తుంది, కేసీఆర్ శరీరం మార్చురీకి ఎలా వెళ్తుంది అంటూ మండిపడ్డారు.

కారల్‌మార్క్స్ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్ళాలి

విశాలాంధ్ర - గార్ల : శ్రమిక వర్గ హక్కుల కోసం ప్రపంచ గమనానికి దిశా నిర్దేశం చేసిన కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని సిపిఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన చూపిన దిక్సూచి వెలుగులో కార్మిక వర్గ చైతన్యంతో సమాజాన్ని మార్చేందుకు పోరాటాలు చేయాలల్సిన సమయం ఆసన్నమైం దన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో కారల్ మార్క్స్ 142వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జర్మనీలో జన్మించి ప్రపంచ దేశాలలో ప్రజలపై జరుగుతున్న పెట్టుబడిదారీ దోపిడీ విధానాలను ఓడించెందుకు సిద్ధాంత పరంగా కృషి చేసినట్లు చెప్పారు. ప్రపంచానికి మార్క్సిజం ఆయుధాన్ని అందించారన్నారు. మార్క్స్ గొప్ప తత్వ వేత్తగా సామాజిక

శాస్త్రవేత్తగా సమాజంలో నిలిచిపోయిన దీశాలి అన్నారు. అనేకమంది శ్రమను అతి కొద్ది మంది చట్టరీత్యా దోచుకోవటం వలన కోటీశ్వరులు కాగలుగుతున్నారని మార్క్స్ ఆనాడే గుర్తించి ప్రజా పోరాటాలు నిర్వహించారని వెల్లడించారు. దోపిడీ వర్గాల నివారణకు ఆచరణాత్మక సిద్ధాంత రూపం కారల్‌మార్క్స్ ఇచ్చాడన్నారు. నేడు భారతదేశంలో అభివృద్ధి అనేది కేవలం పెట్టుబడి చేతుల్లో ఉందన్నారు. దోపిడీ విధానాలను ఓడించాలని, అందుకోసం ప్రజలు ప్రజా పోరాటాల్లో విరివిగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నేడు దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ మోడీ ప్రభుత్వం నయా పెట్టుబడి దారి కార్పొరేట్ వర్గాలైన ఆదాని, అంబానీల పంచన చేరి దేశాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రజలు బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదంపై రోడ్డెక్కితే పోరాడాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, ఏ. రామకృష్ణ, ఎస్. నాగరాజు, టి.నాగేశ్వరావు, శ్యామ్, కె. సుజాత, టి.నాగమణి, ఎస్. ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వరి ధాన్యానికి గండి కొడుతున్న రైస్‌మిల్లర్లు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యపు గిడ్డంగులు వందల కోట్ల విలువైన ప్రభుత్వ వరి ధాన్యాన్ని కుల్లగొడుతూ కుటానుకోట్ల ఆస్తులను బినామీ పేర్ల మీద నమోదు చేసుకుంటున్న వైనం వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లల యజమానులు ప్రభుత్వ ఆదాయమైన ఒక వంద యాభై మూడు కోట్ల విలువైన వడ్లను బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉండగా మార్చిన బియ్యాన్ని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఉన్న అంతుచిక్కని రైస్ మిల్లు యజమానులు చేస్తున్న ఆగడాలు అంతా ఇంతా కాదు. ఏడాదికేడాది అక్రమాలు పెరుగుతుండడమే గాని అక్రమాలను అణచివేసే యంత్రాంగమే కనిపించడం లేదు. పౌరసరఫరాల అధికారులు, రెవెన్యూ ఉన్నతాధికారులు కుమ్మక్కై మిల్లర్ల వతస్సు పలకడంతో రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయలు కొల్లగొట్టుకు పోతున్నారు. గడిచిన మూడేళ్ల వ్యవధిలో కేవలం ఒక రైస్ మిల్లరు ఏకంగా సుమారు 50 కోట్లు సర్కారు ఖజానాకు చిల్లు పెట్టిన తీరు విస్మయం కలిగిస్తోంది. అక్కడి కాంగ్రెస్ నేత ఒకరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తాజాగా ఆ రైస్ మిల్లరుపై పోలీసు కేసు నమోదైంది. ఈ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది.

తీగ లాగితే డొంక కదిలిన చందంగా... బైంసా నిర్మల్ ప్రాంతంలో భారీగా ప్రభుత్వాన్ని

మోసం చేసి ఖజానాకు చిల్లుపెట్టిన రైస్ మిల్లర్ల బాగోతాలు తెరపైకి వస్తున్నాయి. కలెక్టర్ అభిలాష అభినవ్ తాజాగా కొరడా ఝులిపిస్తున్న నేపథ్యంలో అటు అధికారులు, ఇటు పోలీసులు రంగంలోకి దిగి కేసులు నమోదు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఫిర్యాదు జరిగితే గాని ఇప్పటిదాకా కేసులు నమోదు కాకపోగా టాస్క్ ఫోర్స్ యంత్రాంగం రంగంలోకి దిగిన నేపథ్యంలో కిందిస్థాయి అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. గత కొన్ని రోజుల వరకు ఎవరు ఏం చేస్తారన్న ధీమాతో ఉన్న మిల్లర్లు తాజా పోలీసు కేసులతో గడగడలాడిపోతున్నారు. ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెట్టిన మిల్లర్లపై కేసులు పెట్టడంతో పాటు భారీగా దండుకున్న డబ్బులతో వారి పేర్లతో పాటు బంధువుల కుటుంబ సభ్యుల పేర్లతో స్థిరాస్తుల సమాచారంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం తెలిసింది. రెవెన్యూ పోలీసు కేసుల ఆధారంగా అలాంటి ఆస్తులను అటాచ్ చేసే అవకాశాలు ఉన్నాయని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఇంతకాలంగా ఇష్ట రాజ్యంగా వ్యవహరించి వందల కోట్ల విలువైన ప్రభుత్వపు వరి ధాన్యాన్ని కొల్లగొట్టిన రైస్ మిల్లర్లపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. రెండు మూడేళ్లుగా సిఎంఆర్ ధాన్యం బకాయిలు చెల్లించని యజమానులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం ఈ నేపథ్యంలోనే జిల్లా పౌర సరఫరాల అధికారి రాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయడం కలకాలం రేపుతుంది. గతంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ స్థాయిలోనే చర్యలు తీసుకున్న అధికారులు తాజాగా పోలీసులకు లిఖిత పురోకంగా ఫిర్యాదులు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నుంచి వస్తున్న ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై పోలీసు కేసులకు ఆదేశించారని సమాచారం. తాజాగా కల్లూరులో ఉన్న రైస్‌మిల్ యజమానిపై పోలీసు కేసు నమోదయింది. దీంతో మిగతా మిల్లర్లలో వణుకు మొదలైంది. తమను తాము రక్షించుకునేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తూ సీనియర్ రాజకీయ నాయకులను ఆశ్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇందిర ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్

విశాలాంధ్ర-మార్కాపురం : ఇందిర ఇంజనీరింగ్ కళాశాలకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) 'బి' గ్రేడ్ జారీచేసింది. కళాశాలలో అమలుచేసే విద్యా విధానాలు, ఫలితాలు, అధ్యాపకులు, పరి శోధనా విభాగాలు, మౌలిక సౌకర్యాలు, విద్యార్థులకు అందించే సదుపాయాలు లాంటి విభాగాల్లో నాణ్యతను పరీక్షించి, దాని ఆధారంగా గ్రేడ్లను న్యాక్ జారీ చేస్తుంది. ఫిబ్రవరి 28 నుండి నుంచి మార్చ్ 1 తేదీ వరకు ఇందిర కళాశాలలో పర్యటించిన న్యాక్ బృందం మౌలిక సదుపాయాలు,విద్యా విధానాలు, కళాశాల అవలంభిస్తున్న విధానాలపై సంతృప్తి వ్యక్తం చేసి 'బి' గ్రేడ్ ఇచ్చినట్లు కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్రలు తెలిపారు. ఈ ఘనత సాధించటానికి కృషి చేసినటువంటి కళాశాలలోని అధ్యాపక బృందానికి, అధ్యాపకేతర బృందానికి, విద్యార్థులకు అందరికి కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల రాజశేఖరరెడ్డి, విభాగదీపతులు సురేంద్ర రెడ్డి, పుష్పలత, సత్యవాణి, నసీమ, గంగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని నాగరాజు కుంట గ్రామంలో గల రైతు సేవా కేంద్రం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ మార్క్ఫెడ్ నాఫెడ్ ఆధ్వర్యంలో కందులు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలైన కందులు, పప్పు సెనగ మినుము ధాన్యాన్ని, ఈ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునేందుకు ప్రభుత్వము మండలంలోని నాగరాజు కుంట చిన్నారి కట్ల సొసైటీలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ఎం బాబురావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రామిరెడ్డి నాగరాజు కుంటసర్పంచ్ కామసాని వెంకటసుబ్బారెడ్డి, రేగడపల్లి, చిన్నారి కట్ల సొసైటీల అధ్యక్షులు కనకము నరసింహారావు, సాని కొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు తాటిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పెరికేసుకుదేవ్ పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాలలో గత వారం రోజులలో పలు గ్రామాలలో వరుస దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మండల ప్రజలు భయాందోళనతో బెంబేలుతున్నారు. ఇటీవల కాలంలో మారెళ్ళ, ముండ్లమూరు గ్రామాలలో ద్విచక్ర వాహనం, జెసిబి తొట్టి, హొటల్లోనే దోశ పెనం, ముళ్ళమూరు గ్రామంలో బర్లీ పొగాకు, దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు బెంబేలు లెత్తుతున్నారు. ముండ్లమూరు గ్రామంలోని పోలేరమ్మ గుడి ఎదురుగా జెసిబి కి సంబంధించిన పళ్ళ తొట్టి చోరీకి గురికాగా మరుసటి రోజు బంగారయ్య హోటల్ దోసెలు వేసే పెనం, ఆ మరుసటి రోజు మారళ్ళ గ్రామంలో ద్విచక్ర వాహనం చోరీకి గురి అయినది. గురువారం రాత్రి జమ్మల మడక గ్రామంలో ఉన్న శ్రీ దుర్గా చెన్న మల్లేశ్వర స్వామి ఆలయంలో 10 సవర్ల బంగారం, కానుకల హుండీ లోని పదివేల నగదు 10 లక్షల రూపాయల విలువ గల బంగారం, వెండి, కంచు ఆభరణములు, నగదును దుండగులు ఎత్తుకొని వెళ్లి హుండీని పగుల గొట్టి, మంగళ సూత్రాలను, దోచుకుని వెళ్లారు. అలాగే బొప్పూడి వారి పాలెం గ్రామంలోని పోలేరమ్మ గుడి, ఆంజనేయ స్వామి దేవాలయంలో పదివేల నగదును దోచుకు వెళ్లారు.

సెయిలింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి ఎంపిక

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సింగపూర్ యూత్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు హైదరాబాద్‌కు చెందిన రిజ్వాన్ మొహమ్మద్ (పాట్టిగడ), లాహిరి కొమరవెల్లి (రసూల్‌పురా), వినోద్ దందు (నల్లగుట్ట) ఎంపిక య్యారు. ఈనెల 14 నుంచి సింగపూర్ లోని నేషనల్ సెయిలింగ్ సెంటర్‌లో జరిగే ఈ టోర్నీలో 25 దేశాల నుంచి 200 మంది పాల్గొంటుండగా రిజ్వాన్, లాహిరి గోల్డ్ ఫ్లీట్ కోసం ఎంపికయ్యారు. ఈ ఇద్దరూ అండర్-15 ఆప్టిమిస్ట్ క్లాస్ బోట్స్ విభాగంలో పోటీ పడతారు. ఈ టోర్నీలో భారత టీమ్ మేనేజర్‌గా హైదరాబాద్‌కే చెందిన ధరణి లావేటి వ్యవహరించనుంది. ఆమె గతంలో జూనియర్ 420 క్లాస్లో నేషనల్ చాంపియన్. హైదరాబాద్ కోచ్ సుహీమ్ షేక్ జాతీయ కోచ్‌గా ఈ టోర్నీలో భారత జట్టుకు మార్గనిర్దేశం చేయనున్నారు. ప్రస్తుతం ఈ బృందం కొంపల్లిలోని సుచిత్ర అకాడమీలో అత్యుత్తమ ఫిట్‌నెస్ కోచ్‌ల నేతృత్వంలో శిక్షణ పొందుతోంది. కాగా, సింగపూర్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి మొత్తం ఎనిమిది సెయిలర్లు పోటీ పడనున్నారు. హైదరాబాద్ సెయిలర్లకు తోడు చెన్నైకి చెందిన నేషనల్ చాంపియన్ శ్రేయా కృష్ణ, భోపాల్‌కు చెందిన సమృద్ధి బాతమ్ కూడా ఈ జట్టులో ఉన్నారు. తమకు ఇది మూడో అంతర్జాతీయ టోర్నమెంట్‌అని, యాట్ క్లబ్‌లో నాణ్యమైన డైట్, యోగా సాధనతో ఫిట్‌నెస్ పెంచుకొని బలంగా తయారయ్యామని రిజ్వాన్, లహిరి తెలిపారు. ఈ టోర్నీలో దేశానికి మంచి పేరు తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ టోర్నీకి సెయిలర్లు ఎంపికవ్వడం పట్ల తెలంగాణ సెయిలింగ్ సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్ యాట్ క్లబ్ డైరెక్టర్ సుహీమ్ షేక్ సంతోషం వ్యక్తం చేశాడు.

అర్ధరాత్రి హోటల్లో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-కూకట్పల్లి: అగ్ని ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు అయినా సంఘటన కూకట్పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వివేకానంద నగర్ కమాన్ పరిధిలో గల ఓ హొటల్‌లో అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. అదే హొటల్‌లో పని చేసే శ్రీనివాస్ మంటలను అదుపు చేద్దామని వెళ్లి గాయాల పాలయ్యాడు. ఆస్తి నష్టం పెద్దగా కాకపోయిన శ్రీనివాస్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ధర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలుపారు.

నిర్లక్ష్యం వహించిన అధికారులపై వేటు...

విశాలాంధ్ర - సత్తుపల్లి : సత్తుపల్లి సబ్ జైలు నుంచి ఖైదీ పరారైన ఘటనలో బాధ్యులపై జైళ్ల శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల సత్తుపల్లి సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. నిందితుడు తన భార్యని హత్య చేసే ప్రయత్నం చేశాడనే అభియోగంపై అతను జైలుకు వచ్చాడు. కాగా జైల్లో నుంచి అతను పరారీ కావడం ఈ ప్రాంతంలో సంచలనం కలిగించింది. జైలు నుంచి పరారీ అయిన ఖైదీలు పోలీసులు కొన్ని గంటల్లోనే తిరిగి అరెస్టు చేశారు. అయినప్పటికీ ఖైదీ పరారీ అయినా ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై జైళ్ల శాఖ ఉన్నత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో సబ్ జైలర్, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జైళ్ళ శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ బుధవారం శాఖ పరమైన విచారణ జరిపి విధుల్లో నిర్లక్ష్యం వహించిన సబ్ జైలర్ ప్రవీణ్, కానిస్టేబుల్స్ మారేశ్వరావు, శ్రీనులపై సస్పెన్షన్ విధించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

గిరిజన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని అయినముక్కల గ్రామంలో 49 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న గిరిజన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను శుక్రవారం యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్‌లతో మాట్లాడి పనులలో జాప్యం జరగకుండా త్వరగతిన హాస్పిటల్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందు బాటులో తీసుకురావాలని కోరారు. ఈ ఆసుపత్రి పూర్తి అయితే పశ్చిమ ప్రాంత గిరిజన ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని తెలిపారు. ఈ ఆసుపత్రి తొందరగా పూర్తి అయితే ఈ ప్రాంత ప్రజలకు ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జున రెడ్డి, షేక్. మాబు, బ ట్టు సుధాకర్ రెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, లాయర్ వల్లపునేని కాశయ్య, చంటి, ఈదర మల్లయ్య, ఫేక్ మంజూరు భాష,, సోమేపల్లి శేఖర్, చెన్నారెడ్డి, రమణారెడ్డి, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని ప్రతి గ్రామంలో చిన్నపిల్లలు పెద్దలు శుక్రవారం ఘనంగా హోలీ పండగ నిర్వహించుకున్నారు. మండల కేంద్రములో జరిగిన హోలీ కార్యక్రమంలో ముదివర్తి వేంకటా చలపతిరావు మాట్లాడుతూ హోలీ అనేది వసంత రుతువును స్వాగతించే పండుగ. శీతా కాలపు నీలిమంటలు తొలగిపోయే రోజు, చెడుపై మంచి గెలిచిన సందర్భంగా ప్రత్యేకంగా మనము ఈ పండుగను నిర్వహించుకుంటాము. హోలీకి ఒకరోజు ముందే హోలీకా దహన్ చేస్తారు. అంటే చెడును అగ్నిలో వేసి కాల్చేస్తారు. భారతదేశంలోని ఉత్తర భారతంలో హోలీకా దహన్ చాలా పెద్దగా నిర్వహించుకుంటారు. మన వైపు హోలీ పండుగను రంగుల చల్లుకోవడం ద్వారా నిర్వహించుకుంటాం. ప్రకృతిలో ఆనందకం మైన మార్పు, ఇవన్నీ మనకు రంగుల కలయిక వలె ఉత్సాహాన్ని వ్వాలనీ, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంలో మన సమాజం యొక్క సమర్థతను పెంచుకొనేందుకు అన్ని వర్గాల ప్రజలను కలిపి ఏకీకృతం చేసే పండుగే హోలీ పండుగ. కుల, వర్గ భేధ భావాలను బాల్యం నుంచే తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుందన్నారు.

పశుగ్రాసం కొరత

విశాలాంధ్ర-ముండ్లమూరు : వర్షాభావ పరిస్థితులు నెల కొనడంతో కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. పశ్చిమ ప్రకాశంలో సరిగా వర్షాలు పడక, సాగర్ జలాలు లేక పంటలు పండక, ఒకవైపు పశుగ్రాసం కొరత మరోవైపు వెరసి పాడి లేక ఇటుకాడెద్దులకు మేత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో తాగేందుకు చుక్క నీరు, పశుగ్రాసం లేకపోవడంతో పశ్చిమ ప్రకాశంలోనే పుల్ల చెరువు మండలం నుండి ఆవులు మందలు పొరుగు జిల్లాకు వలస వెళుతున్నాయి. శుక్రవారం ముండ్లమూరు నుంచి సుమారు నాలుగువేల ఆవులను మేత కోసం గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాలకు, బాపట్ల జిల్లాలోని కొన్ని మండలాలకు తోలుకెళుతూ విశాలాంధ్రకు కనిపించారు. దాహార్తితో ముండ్లమూరు వేంపాడు గ్రామాల మధ్య ఉన్న చిలక లేరు వాగులో నీటిని దప్పిగా తీర్చుకుంటూ ముందుకు సాగాయి.

మూగ జీవుల వలస...

విశాలాంధ్ర-సీఎస్ పురం : కనిగిరి నియోజకవర్గ ప్రజలు దేశంలోనే నలుమూలన బతుకుదెరువు నిమిత్తము వలసలు ఎక్కువగా ఉంటాయి అదే విధంగా మూగజీవులు కూడా ఎండాకాలం వస్తే నాగర్జునసాగర్ కాల్వ ప్రాంతమైన దర్శి తదితర నీటి ప్రాంతానికి పశువులు గొర్రెలు మేకలు వలస వెళ్లటం జరుగుతుంది ఇంకా ఎంతకాలం ఈ గోసా అంటూ స్థానిక రైతులు వాపోతున్నారు కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్‌తో పాటు వర్షాలు కూడా సంవత్సరానికి 10,15 సార్లు వర్షం పడుతుంది. ఈ ప్రాంతం కరువు ప్రాంతం కనుక అనేక ఇబ్బందులకు లోని మనుషులు తాగే దానికి కూడా నీరు ఉండదు. మూగజీవులను నీటి ప్రాంతానికి తీసుకెళ్లటం అక్కడనే రుతుపవనాలు వచ్చేంతవరకు నీటి ప్రాంతానికి ఆవులను గొర్రెలను మేకలను తీసుకుని వెళ్ళటం జరుగుతుంది రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల గోడును విన్నవించుకుని తొందరగా వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని రైతులు రైతు కూలీలు పేద ప్రజలు బడుగు బలహీన వర్గాలు ఎక్కువ శాతం ఉన్న కనిగిరి ప్రజలు కోరుకుంటున్నారు.

టీడీఆర్ బాండ్లకు నిర్దిష్ట గడువు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల జారీలో ఆలస్యం లేకుండా నిర్దిష్ట గడువును ప్రభుత్వం విధించింది. ఆన్ లైన్‌లో మాత్రమే బాండ్లకు దరఖాస్తు జారీ చేసేలా గడువు విధించింది. ఈ మేరకు మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏ అధికారి స్థాయిలో ఎన్ని రోజుల్లో ఫైల్ క్లియర్ చేయాలనే దానిపై విధివిధానాలను ఆ ఉత్తర్వులలో వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీఆర్ బాండ్లలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఇందులో వైసీపీ నేతల పాత్ర ఉందన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ బాండ్లపై విచారణకు ఆదేశించారు. గుంటూరు, తిరుపతి నగర పాలక సంస్థలు, బొబ్బిలి మునిసిపాలిటీలలో గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై విచారణ కొనసాగుతోంది. ఈ బాండ్ల వ్యవహారం పాదర్శకంగా ఉండేందుకుగాను కూటమి ప్రభుత్వం వివిధ మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రపంచానికి ఆదర్శం కారల్ మార్క్స్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వామపక్ష నేతల ఘన నివాళి

విశాలాంధ్ర–విజయవాడ (చిట్టినగర్): ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహామహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నివాళి అర్పించారు. ప్రపంచానికే ఆయన ఆదర్శనీయుడని కొనియాడారు. కారల్ మార్క్స్ విగ్రహ కమిటీ అధ్వర్యంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడలోకారల్ మార్క్స్ 142వ వర్ధంతి శుక్రవారం జరిగింది. కారల్ మార్క్స్ విగ్రహానికి వామపక్ష నాయకులు పూలదండలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో జీవపరిణామ సిద్ధాంతకర్త డార్విన్, మానవ పరిణామ సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ అని, వీరిద్దరికీ గల ప్రత్యేక స్థానాన్ని ఎవరైనా అంగీకరించాల్సిందేనన్నారు. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఆధిపత్య ధోరణి పెరిగిందని, అమెరికాలో ఉన్న మన ప్రజల పట్ల నియంతృత్వ పద్ధతుల్లో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మరోపక్క ప్రధాని నరేంద్ర మోదీ తన అధికారమంతా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా ఉపయోగిస్తున్నారని, మతప్రాతిపదికన సమాజాన్ని విభజించి... మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఆర్థిక అంశాల్లో కార్పొరేట్ అనుకూల ఎజెండా, రాజకీయ విషయాలలో మత ఎజెండాతో ఓట్లు రాబట్టేందుకు నిరంతరం కుట్రలు చేస్తున్నారని, వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకొని విపక్షాలపై వేధింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. విద్యావంతులను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి యూజీసీని నిస్సిగ్గుగా వాడుకుంటున్నారన్నారు. యూనివర్సిటీల వైస్‌చాన్సలర్ల నియామకాన్ని సైతం తన చేతుల్లో పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. మోదీ సర్కారు నియంతృత్వ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మోదీ సర్కారు దుర్మార్గాల నుండి 146 కోట్ల ప్రజలను, రాజ్యాంగాన్ని కాపాడేందుకు లౌకిక, ప్రజాతంత్రవాదులను, వామపక్షాలను ఐక్యంచేసే బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని అన్నారు. ఐక్యంగా ఉద్యమించటం ద్వారానే కారల్ మార్క్స్‌కు ఘన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కారల్ మార్క్స్ రచనలు కార్మిక వర్గానికి ఆయుధాలని చెప్పారు. నాటి కమ్యూనిస్టు మేనిఫెస్టో ఈనాటికీ అనేక దేశాలకు ఆదర్శనీయంగా ఉందని కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ కమ్యూనిస్టు వారసత్వానికి, దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి వర్గ పోరాటం అనివార్యమని కారల్ మార్క్స్ సిద్ధాంతం నిరూపించిందన్నారు. సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు పద్మ మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో అధికారంలోకి రావడానికి పాలకులు చేస్తున్న కుట్రలను ప్రజలంతా గమనించాలన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ సుజాత, డాక్టర్ సత్యానందం, ప్రొఫెసర్ సి.నర్సింహారావు, తాజారావు, కాగితాల రాజశేఖర్, నాయకులు బి.సత్యబాబు, తాడి పైడయ్య, కొట్టు రమణారావు, పంచదార్ల దుర్గాంబ, సంగుల పేరయ్య, ఓర్సు భారతి, డి.సీతారావమ్మ, మందగల్ల సాయికుమార్, మోతుకూరి అరుణ్ కుమార్, పరుచూరి అజయ్‌కుమార్, సయ్యద్ అఫ్సర్, ఎస్‌కే నజీర్, భాషా, వామపక్ష మేధావులు పాల్గొన్నారు.

ఆకాశంలో అద్భుతం 'బ్లడ్ మూన్'

వాషింగ్టన్: ఆకాశంలో అద్భుతం చోటుచేసుకున్నది. అమెరికా, పశ్చిమ యూరప్, ఆఫ్రికా దేశాల 'బ్లడ్ మూన్' కనువిందు చేసింది. చంద్ర గ్రహణం సందర్భంగా ఆకాశంలో చంద్రుడు ఎర్రబడటం అరుదైన ఘటన. ప్రపంచంలో చాలా మందికి 'బ్లడ్ మూన్' కనిపంచింది. ఈ చంద్రగ్రహణానికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. దానిని చూసిన వారంతా విరివిగా ఫొటోలు, వీడియోలు పంచుకున్నారు. ఈనెల 13, 14 తేదీల్లో 'బ్లడ్ మూన్' కనిపించింది.

సెకీ ఒప్పందం రద్దు చేయాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రజలపై రూ.లక్షా పదివేల కోట్లు విద్యుత్ భారం మోపే అవినీతికర సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ... దాన్ని రద్దు చేయబోమని, కొనసాగిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు గతంలో వైసీపీ ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ద్వారా అదానీ సంస్థల నుంచి ఏడు వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని చేసుకుందని, ఆనాటి ప్రభుత్వ పెద్దలకు రూ.1,750 కోట్లు ముడుపులిచ్చి ఒప్పందం చేసుకున్నట్లు అమెరికా కోర్టులో సాక్ష్యాధారాలతో విచారిస్తోందని గుర్తుచేశారు. ఒప్పందం రద్దు చేస్తే అపరాధ రుసుం కట్టాల్సి వస్తుందని సీఎం చెప్పడం వాస్తవ విరుద్ధమని పేర్కొన్నారు. ప్రపంచంలో శ్రీలంక, బంగ్లాదేశ్‌తోపాటు అనేక దేశాలు అదానీ సంస్థలతో ఒప్పందాలు రద్దు చేసుకున్న విషయాలను ఆయన గుర్తుచేశారు. అదానీ ఒప్పందం విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో గత వైసీపీ ప్రభుత్వం, నేటి కూటమిలోని టీడీపీ, జనసేన ఒకే దారిలో నడుస్తున్నాయని మండిపడ్డారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని గతంలో ప్రతిపక్షంలో ఉన్న నేటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హైకోర్టులో పిల్ వేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోవాలని, రాష్ట్రానికి హానిచేసే అదానీ, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఉగాది తర్వాత ఐదువేల మందికి ఇళ్ల పట్టాలు: లోకేశ్

విశాలాంధ్ర–మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో 100 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. యర్రబాలెంలో ఆధునీకరించిన శ్రీ భగవాన్ మహవీర్ గోశాలను, నూతన సముదాయాలను కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. గోపాలమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మీడియాతో లోకేశ్ మాట్లాడుతూ... జైన్ సోదరులు 25 ఏళ్లుగా గోశాల నిర్వహిస్తున్నారన్నారు. రెండు ఆవులతో మొదలైన గోశాల 450 ఆవులకు చేరిందన్నారు. లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నిర్వహించే గోశాలను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రభుత్వ, కొండ పోరంబోకు, చెరువు, రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి ఉగాది తర్వాత మొదటి విడతగా సుమారు ఐదు వేల మందికి ఇళ్ల పట్టాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రెండో విడత, మూడో విడతలో మిగిలిన ఇళ్ల పట్టాలు అందిస్తామని తెలిపారు. నిడమర్రు గేటువద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి విషయంలో పెమ్మసాని చొరవ తీసుకున్నారు. త్వరలో పనులు ప్రారంభించబోతున్నాం. ఇళ్ల పట్టాల విషయంలో మహానాడు ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని ప్రజలు కోరారు. ఇప్పటికే నిధులు కేటాయించాం. డిజైన్ పనులు జరుగుతున్నాయి. నాలుగు లైన్ల రోడ్డు కూడా నిర్మిస్తామని అన్నారు. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ ఏర్పాటుచేస్తామని, భూములు పరిశీలించడం జరిగిందన్నారు. స్వర్ణకారులను ఆదుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. మంగళగిరిలో ట్రాఫిక్ సమస్యను ఏడాది లోపు పరిష్కరిస్తామన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తిచేసిన తర్వాత ఈ–11, ఈ–13, వెస్ట్రన్ బైపాస్‌ను జాతీయ రహదారికి అనుసంధానిస్తామని తెలిపారు. పెమ్మసాని మాట్లాడుతూ ఎన్నికలకు ముందు దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజీలో పసుపు దగ్ధంతో రైతులకు రూ.40 కోట్ల నష్టం జరిగిందని, రెండు వారాల్లో పసుపు రైతులకు పరిహారం అందిస్తామన్నారు. ఎయిమ్స్ ఆసుపత్రి సామర్థ్యాన్ని 60 శాతం నుంచి 100 శాతానికి పెంచుతామని చెప్పారు.

విపక్ష నేతల లొంగుబాటుకే ఈడీ అస్త్రం

మోదీ సర్కారుపై సీపీఎం ఎంపీ విమర్శ

తిరువనంతపురం: కేరళలోనే కాకుండా భారతదేశమంతటా ప్రతిపక్షనేతలను లొంగదీసుకోవడానికి మోదీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని సీపీఐ(ఎం) ఎంపీ కె. రాధాకృష్ణన్ తీవ్రంగా విమర్శించారు. తాజాగా కరువన్నేర్ కోఆపరేటివ్ బ్యాంకు కుంభకోణం కేసుకు సంబంధించి తమ ముందు హాజరు కావాలని రాధాకృష్ణన్‌కు ఈడీ నోటీసులిచ్చింది. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ...'ఈడీ ఇచ్చిన నోటీసులో కరువన్నూర్ కేసు గురించి ప్రస్తావించలేదు. ఆ కేసుకు బదులుగా నా బ్యాంకు ఖాతాలు, భూమి రికార్డులు సహా ఆస్తుల వివరాలు సమర్పించాలని కోరింది. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున ఈడీ ఎదుట హాజరు కాలేనని, సమావేశాల అనంతరం హాజరవుతానని ఈడీకి లేఖ రాశాను. ఈడీ అధికారులు నేను సంపాదించిన ఆస్తుల కోసమే వెతుకుతున్నారు. వారు దర్యాప్తు చేసి కనుక్కోనివ్వండి' అని ఆయన అన్నారు. కాగా, కరువన్నూర్ సర్వీస్ కోఆపరేటివ్ బ్యాంకులో జరిగిన అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 15న ఈడీ ఎదుట హాజరుకావాలని రాధాకృష్ణన్‌కు ఆ సంస్థ సమన్లు జారీ చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయాలని ఈడీ అధికారులు కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుమారు 150 కోట్ల రూపాయల మేర కోఆపరేటివ్ బ్యాంకులో అవకతవకలు జరిగాయని ఆరోపణలొచ్చాయి. దీనిపై 2021లో త్రిస్సూర్‌లో కేరళ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ 16 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసింది. ఈ కేసులో 2023 ఆగస్టు- సెప్టెంబర్‌లో ఈడీ దాడులు నిర్వహించింది.

అగ్నిప్రమాదం: ముగ్గురు సజీవదహనం

రాజ్‌కోట్: గుజరాత్ రాజ్‌కోట్‌లోని అట్లాంటిస్ బహుళ అంతస్తుల భవనంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు సజీవదహనమయ్యాయని, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసు అధికారులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై ఎస్పీ బీజే చౌదరి మీడియాతో మాట్లాడుతూ 'భవనంలో చెలరేగిన మంటల వల్ల ముగ్గురు మృతి చెందారు. ఒకరికి గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాం. ఆ ఫ్లాట్‌లో నివశిస్తున్న వారిని వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయించాం. భవనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని ప్రాథమికంగా అంచనాకొచ్చాం. ప్రస్తుతం సహాయ సిబ్బంది మంటల్ని అదుపులోకి తెచ్చారు' అని అన్నారు.

నటుడు, నిర్మాత దేవ్ ముఖర్జీ మృతి

ముంబై: బాలీవుడ్‌లో ప్రముఖ దర్శకుడు అయాన్ ముఖర్జీ తండ్రి, పాతతరం నటుడు, చిత్రనిర్మాత దేవ్ ముఖర్జీ (83) కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం ముంబైలోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు జూహూలోని పవన్ హన్స్ శ్మశాన వాటికలో ముగిశాయి. 'తూ హీ మేరీ జిందగీ, అభినేత్రి, దో ఆంఖే, బాతో బాతో మే, జో జీతా వహీ సికందర్, కింగ్ అంకుల్, కమీనే' వంటి చిత్రాల్లో దేవ్ ముఖర్జీ సపోర్టింగ్ పాత్రల్లో కనిపించారు. 1983లో మిథున్ చక్రవర్తి, కాజల్ కిరణ్, యోగితా బాలిని పెట్టి 'కరాటే' అనే చిత్రాన్ని నిర్మించారు. ప్రముఖ సమర్థ్–ముఖర్జీకి చెందిన దేవ్ ముఖర్జీ ప్రముఖ నటీమణులు కాజల్, రాణి ముఖర్జీకి బాబాయి అవుతారు. అలాగే దర్శకుడు అశుతోష్ గోవారికర్‌కు పిల్లనిచ్చిన మామ. కాగా, దేవ్ ముఖర్జీ తల్లి సతీదేవి... నాటి ప్రముఖ నటులు అశోక్ కుమార్, కిశోర్ కుమార్, అనూప్ కుమార్‌కు ఏకైక సోదరి. దేవ్ ముఖర్జీ సోదరులు జాయ్ ముఖర్జీ ప్రముఖ నటుడు, సినీనిర్మాత కాగా సోమూ ముఖర్జీ బాలీవుడ్ తార తనుజా (కాజల్ తల్లి) భర్త. దేవ్ ముఖర్జీకి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సినీతారలు అంతిమ వీడ్కోలు పలికారు. నివాళులర్పించిన వారిలో కరణ్ జోహార్, అనీల్ కపూర్, ఆలియా భట్, రణబీర్ కపూర్, రితిక్ రోషన్, జయా బచన్ తదితరులు ఉన్నారు.

పునర్విభజనపై జేఏసీకి విజయన్ సంఘీభావం

తిరువనంతపురం: కేంద్ర ప్రభుత్వ పునర్విభజన ప్రక్రియకు వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వ సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ)కి కేరళ సీఎం పినరయి విజయన్ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ నెల 22న చెన్నైలో జరగబోయే జేఏసీ సమావేశానికి హాజరు కావాలని కేరళ సీఎంను తమిళనాడు ఆహ్వానించింది. ఇదే క్రమంలో తమిళనాడు ఐటీ మంత్రి రాజన్, దక్షిణచెన్నై ఎంపీ తమిజాచి తంగపాండియన్ శుక్రవారం పినరయి విజయన్‌కు ఫోన్ చేశారు. అనంతరం ఎక్స్ మాధ్యమంగా విజయన్ తన సంఘీభావాన్ని ప్రకటించారు. స్టాలిన్ బయోగ్రఫీని తమిళనాడు మంత్రి తనకు అందజేసిన చిత్రాన్ని సీఎం పంచుకున్నారు. అలాగే, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు వినయ్ విశ్వం, ఎంవీ గోవిందన్‌నూ తమిళనాడు బృందం ఆహ్వానించింది. కేరళలోని ఇతర ప్రాంతీయ పార్టీల నేతలనూ ఆహ్వానిస్తోంది. రాజన్ మాట్లాడుతూ తాము కలిసిన వారంతా పునర్విభజనపై ఆందోళన వ్యక్తంచేశారన్నారు. పార్లమెంటులో అన్ని రాష్ట్రాలకు సముచిత ప్రాతినిధ్యం అవసర మని ఆయన నొక్కిచెప్పారు. ఈ విషయంలో తమిళనాడు కచ్చితమైన వైఖరితో ఉన్నట్లు తెలిపారు. జేఏసీ సమావేశానికి హాజరవుతామని చాలా రాష్ట్రాలు ఇప్పటికే తెలిపాయని రాజన్ వెల్లడించారు.

ఉగ్రవాద కేంద్రం ప్రపంచానికి తెలుసు

పాక్‌పై భారత్ మండిపాటు

న్యూఢిల్లీ: పొరుగుదేశాల్లో అస్థిరత నెలకొల్పేందుకు భారత్ ప్రయత్నిస్తోందని పాకిస్థాన్ మరోసారి ఆరోపణలు చేసింది. దీనిపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. పాక్ చేస్తున్న నిరాధార ఆరోపణలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. ఉగ్రవాదానికి కేంద్రం ఎక్కడుందో ప్రపంచం మొత్తానికి తెలుసని విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ అన్నారు. పాకిస్థాన్ ఇతరుల వైపు వేళ్లు చూపించే బదులు తమ అంతర్గత సమస్యలపై దృష్టిసారిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. బలూచిస్థాన్‌లో జరిగిన రైలు హైజాక్ ఘటనపై పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి షఫ్‌ఖత్ అలీఖాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ భారత్‌పై నిందలు వేశారు. భారత్ తమ దేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. పొరుగుదేశాల్లో అస్థిరత నెలకొల్పేందుకు ప్రయత్నిస్తూ... ప్రపంచవ్యాప్తంగా హత్యాకాండకు పాల్పడుతోందని అన్నారు. గతంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఏ అఘాయిత్యానికి పాల్పడినా భారత్ వైపు చూపించేవారని, ఇప్పుడు పాక్ విదేశీ విధానంలో ఏమైనా మార్పు ఉంటుందా అని మీడియా నుంచి ఎదురైన ప్రశ్నకు షఫ్‌ఖత్ అలీఖాన్ వ్యాఖ్యానించారు. పాక్ విదేశీ విధానంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టంచేశారు. 'భారత మీడియా ఒకవిధంగా బీఎల్‌ఏను కీర్తిస్తోంది. ఇది అధికారికంగా కాకపోయినా ఒక విధంగా ఆ దేశ విధానాన్ని ప్రతిబింబిస్తోంది' అని అన్నారు. సుమారు 425 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బీఎల్‌ఏ వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వేర్పాటువాద బలూచ్ మిలిటెంట్లు 33 మందిని హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం పేర్కొంది.

ఇతర దేశాలపై నిందలు సరికాదు: అఫ్గానిస్థాన్

రైలు హైజాక్ వెనక అఫ్గానిస్థాన్ హస్తం ఉందనేందుకు తమవద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని పాక్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపై అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. పాక్ చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. పాక్ బాధ్యతారహిత వ్యాఖ్యలు... వారి దిగజారుడు విధానాలకు నిదర్శనమని తెలిపింది. తమ సమస్యలను పరిష్కరించుకోలేని పాక్... ఇతర దేశాలపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికింది.

అమెరికా విమానంలో మంటలు

17 మందికి గాయాలు

డెన్వర్: అమెరికా, కొలరాడోలోని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మందికి గాయాలయ్యాయి. ఈ మేరకు యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) శుక్రవారం తెలిపింది. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో ఆరుగురు సిబ్బంది, 172 మంది ప్రయాణికులు ఉన్నట్లు పేర్కొంది. ప్రయాణికులు అందరినీ అత్యవసర నిష్క్రమణ మార్గంలో విమానం నుంచి బయటకు తెచ్చినట్టు డెన్వర్ విమానాశ్రయం వర్గాలు తెలిపాయి. విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడం, విమానం రెక్కపై నిలబడి ప్రయాణికులను సిబ్బంది కిందకు దింపుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ప్రాణ నష్టం సంభవించలేదు కానీ 17 మందికి గాయాలయ్యాయని, వారికి ఆసుపత్రిలో తగు చికిత్స అందుతోందని అధికారులు వెల్లడించారు. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం 1006 కొలరాడో నుంచి డాలస్ ఫోర్ట్‌వర్త్‌కు ప్రయాణిస్తుండగా ఇంజిన్‌లో సాంకేతిక సమస్యను గుర్తించి దానిని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారని ఎఫ్ఏఏ తెలిపింది. విమానాశ్రయంలో విమానం దిగిన వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగినట్లు పేర్కొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారని ఎఫ్ఏఏ వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపింది. అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారని అధికారులు వెల్లడించారు. అయితే ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు, అమెరికా పౌర విమానయాన సంస్థలపై ట్రంప్ ప్రభుత్వ తాజా చర్యలతో ఈ ఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది.

'రూపే' చిహ్నం ఎంపికే వివాదాస్పదం

న్యూఢిల్లీ: కేంద్రం, తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వాల మధ్య భాషా వివాదం తారస్థాయికి చేరింది. చివరికి అది 'రూపీ' లోగో వివాదానికి దారితీసింది. తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ లోగోలో ఇప్పటివరకు ఉన్న 'రూపే' లోగో స్థానంలో తమిళంలోని 'రూ' అనే తమిళ అక్షరాన్ని మార్చడం ఇందుకు కారణమైంది. అయితే, రూపాయిని సూచించే గుర్తును ఓ తమిళ వ్యక్తే రూపొందించాడన్న సంగతి తెలిసిందే. మూడు వేలకు పైగా వచ్చిన గుర్తులతో పోటీపడి ఇది విజయం సాధించింది. అయితే దీని ఎంపిక ప్రక్రియా ఓ వివాదమైంది. భారత రూపాయిని సూచించడానికి ఓ మంచి సంకేతం కావాలంటూ 2009 మార్చి 5న కేంద్ర ప్రభుత్వం ఓ పోటీ నిర్వహించింది. ఆ గుర్తు మన విలువలు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని 2010 కేంద్ర బడ్జెట్ సందర్భంగా నాటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ తెలిపారు. ఈ పోటీకి దేశవ్యాప్తంగా 3,331 స్పందనలు వచ్చాయి. అన్ని గుర్తుల్లో నుంచి ఐదు గుర్తులను జాబితా చేశారు. నందిత మెహ్రోత్రా, హితేశ్ పద్మశాలి, షిబిన్ కేకే, షారుఖ్ ఇరానీ, డి.ఉదయ్‌కుమార్ రూపొందించిన గుర్తులు ఈ జాబితాలో ఉన్నాయి. 2010 జూన్‌లో కేంద్రమంత్రివర్గం సమావేశమై వీటిల్లో ఒకదాన్ని ఖరారు చేసింది. ఉదయ్‌కుమార్ రూపొందించిన 'రూపే' గుర్తు విజేతగా నిలిచినట్లు అదే ఏడాది జులైలో ఆర్థికశాఖ ప్రకటించింది. ఆయన తమిళనాడుకు చెందిన డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడు. దేవనాగరి లిపిలోని 'ర', లాటిన్ భాషలోని 'ఆర్' అక్షరాన్ని మిళితం చేసి ఈ సింబల్‌ను ఉదయ్‌కుమార్ రూపొందించారు. పైనున్న రెండు అడ్డగీతలు మన జాతీయ పతాకాన్ని, సమానత్వాన్ని సూచిస్తాయి. ఆర్థిక అసమానతలను తగ్గించాలనే ఉద్దేశంతో దీన్ని ఇలా తీర్చిదిద్దారు. 2010 నుంచి భారత ప్రభుత్వం ఈ గుర్తును అధికారికంగా వినియోగిస్తోంది. అప్పటినుంచి నాణేలు, కరెన్సీ నోట్లతో పాటు పోస్టల్ స్టాంప్‌లు, బ్యాంకు చెక్కుల్లోనూ ఈ చిహ్నం కనిపిస్తోంది. అయితే, దీని ఎంపిక అప్పట్లో వివాదాస్పదమైంది. రూపీ సింబల్ పోటీదారుల్లో ఒకరైన రాకేశ్‌కుమార్ అనే వ్యక్తి ఎంపిక ప్రక్రియను సవాల్ చేస్తూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోటీలో వివక్షపూరితంగా వ్యవహరించారని, లోపాలు, అసమానతలు ఉన్నాయని ఆరోపించారు. వాటిని రుజువు చేసే ఆధారాలు లేకపోవడంతో ఆయన పిటిషన్‌ను హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం కొట్టేసింది. అనంతరం ఈ వ్యవహారం డివిజన్ బెంచ్‌కు చేరగా... న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై జాతీయసంస్థల చిహ్నాలు, లోగోలు రూపొందించడానికి నిర్వహించే ప్రజా పోటీల్లో అవకతవకలు జరగకుండా మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రానికి చెందిన అన్ని మంత్రిత్వశాఖలను ఆదేశించింది. ఏకరీతి స్వభావంతో పోటీలు జరగాలని సూచించింది. అనంతరం 2013 ఏప్రిల్‌లో ఆర్థికశాఖ ఇందుకోసం మార్గదర్శకాలు జారీ చేసింది.

రైతుల్ని చంపేస్తున్న కాషాయ రాజ్యం: రౌత్

ముంబై: కాషాయ పార్టీ పాలనలో రైతులు చనిపోతున్నారని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. బీజేపీ పాలనలో మహారాష్ట్ర రైతులు, నిరుద్యోగులు, మహిళలు ఆత్మహత్యలను శరణ్యంగా భావిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఔరంగజేబు పాలన కంటే ఘోరంగా రాష్ట్ర పాలన ఉన్నదని రౌత్ విమర్శించారు. '400 ఏళ్ల కిందటి ఔరంగజేబు పరిపాలన గురించి కాదు నేటి మీ రాజ్యంలో జరుగుతున్న రైతులు ఆత్మహత్యల గురించి మాట్లాడండి. వారి చావులకు కారణం మీరా? ఔరంగజేబా?' అని సంజయ్ రౌత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఛత్రపతి శంభాజీనగర్‌లోని మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు స్మారకాన్ని తొలగించాలని అంతా భావిస్తున్నారన్న సీఎం ఫడ్నవీస్ వ్యాఖ్యలపై శుక్రవారం విలేకరుల ప్రశ్నకు రౌత్ పై విధంగా స్పందించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.